ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 19 ఫిబ్రవరి 2025



కొత్త బాస్!

కృష్ణా యూనివర్సిటీ వీసీగా కె. రాంజీ

ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్

కృష్ణా యూనివర్సిటీ వీసీ నియామకంపై నెలకొన్న ఉత్కంఠకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో తెరపడింది. నూతన వైస్ చాన్సలర్‌గా కె.రాంజీని నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు రాంజీ ఈ పదవిలో కొనసాగుతారు. ఈయన ప్రస్తుతం విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీగాను ఈయన 2015-2018 వరకు పనిచేశారు.

- మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్న రాంజీ
- ఆరు నెలలుగా ఇన్‌చార్జి వీసీ పాలనలో వర్సిటీ
- నూతన వీసీకి స్వాగతం పలుకుతున్న సమస్యలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కారణాలతో వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన కృష్ణా యూనివర్సిటీ వీసీ జి.జ్ఞానమణి ఏడాది కూడా పూర్తి కాకుండానే ఆ పదవి నుంచి తప్పుకున్నారు. అనంతరం కాకినాడ జేఎన్‌టీయూలో పనిచేస్తున్న శ్రీనివాసరావును ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు.

సమస్యల స్వాగతం

నూతన వీసీకి సమస్యలతో కృష్ణా యూనివర్సిటీ స్వాగతం పలుకుతోంది. ఇక్కడ పనిచేసే ప్రొఫెసర్లు, ఉద్యోగుల మధ్య విబేధాలు ఉన్నాయి. ప్రొఫెసర్లు తరగతులకు వెళ్లకుండా ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతారనే విమర్శలున్నాయి. యూనివర్సిటీకి నిధులను ఇష్టానుసారంగా వినియోగించడం, పక్కదారి పట్టించడంలో ఇక్కడి అధికారులకు వెన్నతోపెట్టిన విద్య అనే అపవాదును మూట కట్టుకున్నారు. 2021లో నిబంధనలకు విరుద్ధంగా యూనివర్సిటీ నిధులు రూ.5.25 లక్షలతో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయడంపై అనేక విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం ఈ నిధులు కేటాయింపుపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. దీంతో పాటు యూనివర్సిటీలో జరిగిన ఆర్థికపరమైన అవకతవకలపై గత ఏడాది డిసెంబరు 13వ తేదీన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంపైనా పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది.

నిలిచిన భవనాల నిర్మాణం

వర్సిటీని 2008, ఏప్రిల్‌లో ప్రారంభించారు. 2019 వరకు మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాల ప్రాంగణంలో వర్సిటీ కొనసాగింది. 2019 జనవరిలో మచిలీపట్నం మండలం రుద్రవరంలో రూ.88 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన నూతన భవనాల్లోకి మారింది. వర్సిటీ ఏర్పడి 17 ఏళ్లు గడచినా విద్యార్థులకు విడివిడిగా వసతిగృహాల నిర్మాణం చేయలేదు. నాలుగేళ్ల కిందట ఈ వసతి గృహాల నిర్మాణం ప్రారంభించినా పునాదుల దశను దాటలేదు. వసతి గృహాలు లేకపోవడంతో పీజీ కోర్సుల్లో విద్యార్థులు

మిగతా 6లో..



కృష్ణా యూనివర్సిటీ, (ఇన్‌సెట్‌లో) వీసీగా నియమితులైన రాంజీ

పరీక్షలు, రీసెర్చ్ విభాగాల్లో గందరగోళం

యూనివర్సిటీలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, రీసెర్చ్ విభాగాల్లో పరిపాలన గాడితప్పింది. ఎనిమిది నెలలుగా జవాబు పత్రాల మూల్యాంకనం బిల్లులు చెల్లించకుండా యూనివర్సిటీ అధికారులు తొక్కిపెట్టారు. వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు ఈ అంశంపై ఆందోళనకు దిగడంతో నెలరోజుల కిందట ఈ బిల్లులను విడుదల చేశారు. కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లను సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేస్తున్న దాఖలాలు ఉన్నాయి. రీసెర్చ్ విభాగంలో 57 ఫైల్స్ మాయం కావడం వివాదాస్పదంగా మారింది. రీసెర్చ్ విభాగం నుంచి స్కాలర్స్‌కు సరైన సహకారం లేకపోవడం, నెలల తరబడి గైడ్‌లను నియమించడంలో జాప్యం, సకాలంలో పీహెచ్‌డీ, ఎంఫిల్ పట్టాలను అందజేయకపోవడం తదితరాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.

అలైన్‌మెంట్‌లో అవినీతి!

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నిర్వాకం

- విజయవాడ వెస్ట్ బైపాస్‌లో.. గొల్లపూడిలో అలైన్‌మెంట్ మార్పు
- అనుమతి పొందిన అలైన్‌మెంట్ ఒక చోట.. వేసింది మరోచోట
- పొలం పోయి.. పరిహారం అందక అన్యాయమైన రైతులు
- కోర్టుకు వెళ్లినా పరిహారం ఇవ్వని పవర్ గ్రిడ్ కార్పొరేషన్
- ఈ మోసంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రభుత్వానికి వేడుకోలు



పై శాటిలైట్ చిత్రంలో కనిపిస్తున్నది విజయవాడ వెస్ట్ బైపాస్‌లో భాగంగా ఎన్‌హెచ్-65పై గొల్లపూడి ఆర్‌వోబీ అప్రోచ్‌కు దిగువున వెళ్తున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఎల్) ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్. పసుపు రంగులో ఉన్నది ప్రస్తుత పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ట్రాన్స్‌మిషన్ లైన్ వెళ్తున్న మార్గం. అయితే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా రూపొందించిన ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్ అలైన్‌మెంట్ ప్రకారం పైచిత్రంలో మీరు చూస్తున్న గ్రీన్ లైన్ మీదుగా లైన్‌ను మార్చాల్సి ఉంది. ఇది అప్రూవ్డ్ లైన్. కానీ రెడ్ లైన్‌లో అమాయక రైతుల పొలాల మీదుగా వేశారు. ఈ చిత్రంలో గులాబి రంగులో మార్కింగ్ చేసినది సర్వే నంబర్ 138/2ఏలోని ల్యాంకో టౌన్‌షిప్. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అలైన్‌మెంట్ ప్రకారం ఈ టౌన్‌షిప్‌ను తాకుతూ సర్వే నంబర్ 138/1, సర్వే నంబర్ 120/1ఏలోని అనాథలైజ్డ్ ప్లాట్ల మీదుగా వెళ్లాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు పెద్దలను వదిలేసి సామాన్య రైతులను బలి చేశారు. -ఆంధ్రజ్యోతి, విజయవాడ

ల్యాంకో టౌన్‌షిప్‌ను కాపాడేందుకే..

ల్యాంకో టౌన్‌షిప్‌ను కాపాడటం కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తన అలైన్‌మెంట్‌కు భిన్నంగా, అలైన్‌మెంట్ పరిధిలో లేని సర్వే నంబర్ 137/1జేలో ఉన్న ముప్పా సేతు నారాయణ అనే రైతు పొలం మీదగా తీసుకెళ్లింది. ఈ విషయం ఆ రైతుకు తెలియదు. నిజంగా తన పొలం మీద నుంచే వెళతుందనుకుని మిన్నకుండిపోయారు. పరిహారం అందకపోవటంతో అనుమానం వచ్చి టవర్ల మీద పోరాటం చేస్తున్న

మిగతా 6లో..



నేత్రపర్వం

వైభవంగా వీరమ్మ శిడిబండి ఉత్సవం

భారీగా తరలివచ్చిన భక్తులు

వీరమ్మ తిరునాళ్లలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న శిడిబండి ఉత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. భారీగా తరలివచ్చిన భక్తులతో ఉయ్యూరు జనసంద్రమైంది. దళిత యువకుడు ఉయ్యూరు మౌర్య కిరణ్ (పెళ్లి కొడుకు) నివాసం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం చీర, సారెతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా పెళ్లి కొడుకు బయలుదేరగా, శిడిబండికి దారిపొడవునా బిందెలతో నీళ్లు వారబోసి మహిళలు హారతులిచ్చారు. శివాలయం రోడ్డు నుంచి ప్రధాన సెంటర్ మీదుగా ఊయల స్థంభాల వద్ద ప్రదక్షిణ అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న శిడిబండి ఉట్టిలో పెళ్లికొడుకును కూర్చుండబెట్టి ఆలయ ప్రదక్షిణ చేశారు. జై వీరమ్మ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. -ఆంధ్రజ్యోతి,ఉయ్యూరు

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- కలెక్టర్ డీకే బాలాజీ
- ఘంటసాలలో ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శన

6లో

మట్టి కొట్టొద్దు..!
- కొత్తూరు తాడేపల్లి వద్ద మట్టి పాత్రల తయారీకి బ్రేక్
- పంచాయతీ అనాలోచిత నిర్ణయం.. కుమ్మర్లకు శాపం

8లో

మహాజన సభ వాయిదా
- రెండు వర్గాలుగా గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సభ్యులు

8లో

బదిలీలలు

దుర్గగుడిలో ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో మాయాజాలం

- యథాస్థానాల్లోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ
- వైసీపీ హయాంలో సిఫార్సులతో వచ్చిన వారికి అదే ప్రాధాన్యత
- అవే విభాగాలు ఇచ్చినపుడు.. ఇక బదిలీ ఉత్తర్వులు ఎందుకంటూ భక్తుల విమర్శలు



దుర్గగుడిలో ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో అధికారులు మాయాజాలం ప్రదర్శించారు. పనిచేస్తున్న వారిని మళ్లీ అదే స్థానానికి బదిలీ చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చి బదిలీల ఉద్దేశ్యాన్నే నీరుగార్చారు. వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు, కొట్టు సత్యనారాయణ సిఫార్సులతో వచ్చి పాతుకుపోయిన వారికి మళ్లీ అదే ప్రాధాన్యత ఇచ్చి విమర్శలు మూటకట్టుకున్నారు దుర్గగుడి అధికారుల నిర్వాకంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పలు కీలక విభాగాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఈవో, దేవాదాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ బదిలీ ఉత్తర్వులు చూసి అందరూ నివ్వెరపోయారు. ఎక్కడి వారిని అక్కడే బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం.

- ఎం.దుర్గారావు అనే ఉద్యోగి ప్రస్తుతం స్థలాలు, లీజులు, లీగల్, శివాలయం ఓవరాల్ ఇన్‌చార్జి, పండుగలు, పూజలు నిర్వహిస్తుంటారు. తాజా

మిగతా 6లో..

'రీచ్'లో అగ్నిప్రమాదం

విద్యార్థులకు తప్పిన పెనుముప్పు

- కారిడార్‌లో 35 మంది నిద్రిస్తుండగా మంటలు
- ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు

6లో



అగ్నిప్రమాదంలో కాలిపోయిన విద్యార్థుల మంచాలు



సబ్‌జైలు వద్ద వైసీపీ శ్రేణులను నిలువరిస్తున్న పోలీసులు

జగన్ గ్యాంగ్ అత్యుత్సాహం

బెజవాడ సబ్ జైలులో వంశీని కలిసిన మాజీ సీఎం జగన్

గుంపులుగా తరలివచ్చిన వైసీపీ కార్యకర్తలు

- జైలుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు
- తోసుకుంటూ ముందుకొచ్చి పోలీసులపై వీరంగం
- లాఠీచార్జి చేసి పరిస్థితిని చక్కదిద్దిన వైనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ గాంధీనగర్‌లోని జిల్లా సబ్‌జైలు వద్ద జగన్ గ్యాంగ్ అత్యుత్సాహం ప్రదర్శించింది. పోలీస్ ఆంక్షలను పట్టించుకోకుండా చెలరేగిపోయింది. జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పరామర్శించడానికి మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం వచ్చారు. ఆయన రాక గురించి ముందే సమాచారం తెలుసుకున్న వైసీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని ముందే ఊహించిన పోలీసులు జైలుకు ఉన్న అన్ని మార్గాలను మూసివేశారు. ఎలాంటి వాహనాలు, అనుమతిలేని వ్యక్తులు ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయినా వాటిని తోసుకుని వైసీపీ కార్యకర్తలు గుంపులు గుంపులుగా జైలు వద్దకు చేరుకున్నారు. పోలీసులు జగన్‌కు దుర్గా మహల్ వైపున ఉన్న మార్గాన్ని కేటాయించారు. అయినా కాన్వాయ్ రావడానికి ముందే కార్యకర్తలు బారికేడ్లను తోసుకుంటూ రోప్ పార్టీలను నెట్టేసుకుంటూ జైలు వద్దకు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్ ఉన్న మార్గంలోనూ ఈ విధంగానే వ్యవహరించారు. ఈక్రమంలో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసులు వారిని తప్పించి జగన్ కారును లోపలికి పంపించారు. కారులో జగన్‌తో పాటు మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, దేవినేని అవినాష్ ఉన్నారు. అంతకు ముందే వంశీ సతీమణి పంకజ శ్రీ సబ్ జైలుకు చేరుకున్నారు. తనతో పాటు వంశీకి దుస్తులు తీసుకొచ్చారు. వంశీని పరామర్శించటానికి జగన్, వంశీ

మిగతా 6లో..



సబ్‌జైలులో వంశీని కలిసి బయటకు వస్తున్న వైఎస్ జగన్

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

- శాఖల వారీగా పలువురికి బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన ఈవో



ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పరిపాలనా సౌలభ్యం కోసం పలువురు సిబ్బందిని వివిధ శాఖలకు అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో రామచంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎం.దుర్గారావుకు భూముల లీజులు, శివాలయం ఓవరాల్ ఇన్‌చార్జి, ఉత్సవాలు, పూజలు, దత్తత ఆలయాలను కేటాయించారు. పి.చంద్రశేఖర్‌కు అన్నప్రసాదాల తయారీ, శానిటేషన్, వేదపాఠశాలల నిర్వహణ కేటాయించారు. పి.సుధారాణికి చీరలు, ఆడిట్, సెంట్రల్ ప్రొవిజన్ స్టోర్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లను కేటాయించారు. జె.శ్రీనివాస్‌కు పరిపాలన, ప్రధాన ఆలయం, ఉపాలయాలు, ట్రస్ట్‌బోర్డు, కనకదుర్గ ప్రభ విభాగాలు, ఎన్.రమేష్‌బాబుకు వసతి, ఎస్‌పీఎఫ్, హోంగార్డులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులపై పర్యవేక్షణ, కేశఖండనశాల, శానిటరీ తదితరాలను కేటాయించారు. ఎం.శ్రీనివాసరావుకు గణాంకాలు, ఐటీ రిటర్న్‌లు, స్క్రూటినీ, జీఎస్టీ రిటర్న్‌లు, ప్రధాన ఆలయం విధులు కేటాయించారు. బీఎస్.జగదీష్ ప్రసాద్‌కు పరిపాలన, కొండదిగువన కౌంటర్ల పర్యవేక్షణ, వేదపాఠశాల విధులు అప్పగించారు. పి.సునీతకు అన్నప్రసాదాల విభాగం కేటాయించారు. కనకదుర్గ ప్రభ మాసపత్రిక సంపాదకుడు కె.గంగాధర్‌కు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాలను అప్పగించారు. ఆయన ఇకపై అదనంగా పీఆర్వో విధులను నిర్వహించనున్నారు. పత్రికా ప్రకటనల తయారీ, వ్యతిరేక కథనాలకు రిజాయిండర్లను పంపడం, ఈవోకు ఎప్పటికప్పుడు వార్తా కథనాలను తెలియచేసి సూచనలు తీసుకోవాల్సి ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, పారాయణలు, సప్తాహాలు వంటివాటిని నిర్వహించాలి. ఉత్సవాలు, పండుగల సమయంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన గుర్తింపు పొందిన వలంటీర్ల వ్యవస్థలను సమన్వయం చేస్తూ లయజన్ అధికారిగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు అన్యాయం : రవీంద్ర రాజు

గాంధీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామవార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్ర రాజు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వోలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రీ సర్వే పేరిట ఎంతోమంది వీఆర్వోలు పని ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో పనిఒత్తిడి తగ్గి, పదోన్నతులు, పెండింగ్ డీఏలు, బకాయిలు, ఐఆర్, ప్రకటిస్తారని ఆశించిన ఉద్యోగులు కూటమి ప్రభుత్వ గెలుపునకు కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందన్న ఉద్యోగులు నిరాశతో ఉన్నారన్నారు. కొందరు అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తూ ఈ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రెవెన్యూశాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. రెండు సచివాలయాలకు ఒక వీఆర్వోను నియమించడం ద్వారా వారిపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. సచివాలయాల పునర్వ్యవస్థీకరణ అంశాన్ని పునరాలోచించి ఒక సచివాలయానికి ఒక వీఆర్వోగా ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని కోరారు. అర్హులైన వీఆర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్‌గా ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్స్‌గా, గ్రేడ్-2 వీఆర్వోలను గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు.



వ్యవసాయ ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ
- ఘంటసాలలో ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శన

ఘంటసాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగులో నూతన సాంకేతిక విధానాన్ని రైతులు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఘంటసాలలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద మంగళవారం కిసాన్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త వంగడాలను రూపొందించి, ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రాంత పరిస్థితులు, భూములకు అనుకూలంగా విత్తనాలను రూపొందించి రైతులకు అందిస్తున్న శాస్త్రవేత్తల కృషి అభినందనీయమన్నారు. తొలుత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. వివిధ రకాల పంటలను, డ్రోన్ ద్వారా మందుల పిచికారిని పరిశీలించారు. అనంతరం ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆర్.శారదా జయలక్ష్మిదేవి, పరిశోధనా సంచాలకులు డా.పి.వి.సత్యనారాయణ, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డా.వి.సత్యప్రియ లలిత, కెవికె ప్రధాన శాస్త్రవేత్త డా.డి.సుధారాణిలు కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాడులు చేసి.. నిప్పు పెట్టిన వారికి పరామర్శలా!

- జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం టీడీపీ కార్యాలయంలో దళితులు, యువకులు, మహిళలపై దాడిచేసి పార్టీ కార్యాలయం, కార్లు తగులబెట్టి, వ్యక్తుల్ని గాయపరిచిన వ్యక్తికి వత్తాసు పలికేందుకు జగన్‌రెడ్డి సిగ్గుపడాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలు దేశ చరిత్రలోనే లేవన్నారు. దాడి గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తిని కిడ్నాప్ చేసిన వంశీని సిగ్గులేకుండా పరామర్శకు జగన్ వెళ్లారన్నారు. ప్రశాంతంగా ఉన్నటువంటి కృష్ణా జిల్లాలో పులివెందుల ఫ్యాక్షనిజాన్ని తీసుకురావడానికి జగన్‌రెడ్డి గూండాలు ప్రయత్నించారన్నారు. ఎంతోమంది మేధావులు పుట్టిన కృష్ణాజిల్లాను రౌడీమూకలతో దాడి చేయించి దిగజార్చే విధంగా చేసిన నీచుడు జగన్‌రెడ్డి అన్నారు. జగన్‌రెడ్డి హయాంలో పోలవరం గట్ల మీద, బ్రహ్మలింగం చెరువు గట్ల మీద మట్టి కాజేశారన్నారు. అక్రమంగా దాడులు చేయడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసి ఇనుపరాడ్లతో మహిళలపై దాడులు చేశారన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇలాంటి అరాచకాలు మరోసారి పునరావృతం కాకుండా చూస్తామన్నారు. అధికారం ఉంది కదా అని జిల్లాలో వల్లభనేని వంశీ, కొడాలి నాని, జోగి రమేష్, పేర్ని నాని చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు.

శ్రీశైలం యాత్రకు ప్రత్యేక బస్సు

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. ఈ బస్సు రాజమండ్రి నుంచి బయలుదేరుతుంది. మొత్తం మూడు రోజులపాటు యాత్ర ఉంటుందని అధికారులు తెలిపారు. శక్తి పీఠం, శ్రీశైలం భ్రమరాంబ ఆలయం, మల్లిఖార్జున స్వామి ఆలయం త్రిపురాంతకేశ్వరి ఆలయం, బాలా త్రిపురసుందరీదేవి ఆలయం తదితరాలలో దర్శనాలు కల్పించనున్నారు.

వామ్మో.. వసతి గృహం!

బాలికలకు భద్రత ఎంత!

- పర్యవేక్షణ లేదు.. పౌష్టికాహారం అందదు
- వార్డెన్‌ను చూసి రెండేళ్లు.. : విద్యార్థినులు
- మైలవరం బీసీ బాలికల వసతిగృహంలో వింతలు
- అడిగే నాథుడు లేక అడ్డగోలు వ్యవహారం
- మండిపడుతున్న ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు

ఇల్లు, తల్లిదండ్రులను విడిచి ఉన్నత చదువులే లక్ష్యంగా వచ్చిన ఆ బాలికలకు అక్కడ సరైన భద్రత లేదు.. ఏం తింటున్నారో.. ఎలా ఉంటున్నారో కనీసం పర్యవేక్షించే నాథుడు లేడు.. వార్డెన్ ముఖం చూసి రెండేళ్లయిందని వసతిగృహంలో ఉంటున్న బాలికలే స్వయంగా చెబుతున్నారంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మైలవరం పట్టణంలో పొందుగల రోడ్డులో ఉన్న బీసీ బాలికల వసతి గృహం స్థితిగతులపై సమగ్ర కథనం..



ఖాళీ గదులతో దర్శనమిస్తున్న మైలవరంలోని బీసీ బాలికల వసతిగృహం

(ఆంధ్రజ్యోతి-మైలవరం)

మైలవరం పట్టణంలో పొందుగల రోడ్డులో 2009 నుంచి ఒక అద్దె భవనంలో బీసీ బాలికల గృహాన్ని నిర్వహిస్తున్నారు. మైలవరంలో ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాల్లో చదువుకునే పేద వర్గాలకు చెందినపలువురు బాలికలు ఇక్కడ ఉంటున్నారు. మొత్తం 73 మంది ఉండే విద్యార్థినుల సంఖ్య వార్డెన్ నిర్వాకం వల్ల ప్రస్తుతం 23కు పడిపోయింది.

కనిపించని మెనూ..

వసతి గృహంలో బాలికలకు మెనూ ప్రకారం భోజనం ఉండదు. వంట మనిషికి తోచింది చేసే పెట్టే దయనీయ పరిస్థితి. పదే పదే ఒకే రకం వండటం, నాణ్యత లేకపోవడంతో విద్యార్థినులు అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు అక్కడ వండింది తినలేక ఇళ్లకు వెళ్లి



పోయారు.

రెండేళ్లుగా కానరాని వార్డెన్

రెండేళ్లుగా వార్డెన్ పిల్లల ముఖం చూసింది లేదు. మేం వార్డెన్‌ను చూసి రెండేళ్లవుతుందని అక్కడి పిల్లలే చెబుతున్నారు. అయినా అధికారులు ఏం పట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం. వసతిగృహంలో ఏం జరుగుతుందో కూడా తెలుసుకునే తీరిక కూడా పైఅధికారులకు లేకుండా పోయిందని బాలికల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డెన్ తీరుపై గతంలో ప్రజా సంఘాల నాయకులు అప్పటి కలెక్టర్ ఢిల్లీరావుకు ఫిర్యాదులు చేసినట్టు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సరైన వసతులు, భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు.



● **వార్డెన్‌ను నియమించాలి : చాట్ల సుధాకర్, సీఐటీయూ**

తక్షణం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి. గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ప్రస్తుత కలెక్టర్ స్పందించాలి. తక్షణం కొత్త వార్డెన్‌ను నియమించాలి. వసతి గృహంలో పిల్లలు చేరకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం.



● **నిర్లక్ష్య ధోరణి తగదు : సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ**

బాలికల పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణి మంచిది కాదు. ఉజ్వల భవిష్యత్ ఉన్న బాలికలకు సరైన పోషణ అందకపోతే ఎలా రాణిస్తారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలకు పూనుకోవాలి.

● **ఉన్నతాధికారులకు నివేదిస్తాం : రవి కుమార్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి**

వార్డెన్‌పై వస్తున్న ఆరోపణలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఇక్కడ హాజరు రిజిస్టర్లు ఉండవు. ఆన్‌లైన్‌లోనే హాజరు వేస్తాం. సస్పెండ్ కాకుండా జీతం ఆపలేం. ఇక్కడ చార్జ్ తీసుకొని మూడు నెలలే అయ్యింది. సమగ్ర నివేదిక తయారు చేసి పై అధికారులకు అందజేస్తా.

రీచ్ వసతి గృహంలో అగ్నిప్రమాదం

తప్పిన పెను ముప్పు

- కారిడార్‌లో 35 మంది నిద్రిస్తుండగా.. జెట్ కాయిల్ దుప్పటికి అంటుకుని మంటలు
- ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు
- అర్ధరాత్రి పొగ గమనించిన క్రైస్తవ భక్తులు
- మంటలు అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ, అధికారులు



రీచ్ బాలుర వసతి గృహంలో దగ్ధమైన మంచాలు పరిశీలిస్తున్న అధికారులు, విద్యార్థులకు గాయాలు

గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం రీచ్ విద్యాసంస్థల బాలుర వసతి గృహంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించగా.. తృటిలో పెను ప్రమాదం తప్పింది. లైఫ్ ప్రైమరి, లైఫ్ హైస్కూల్(రీచ్)లో మూడో తరగతి నుంచి 10 వరకు 140 మంది తల్లి, తండ్రి లేని విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు రీచ్ ప్రాంగణంలో ఉన్న వసతి గృహంలో ఒక్కొక్క కారిడార్‌లో 35 మంది ఉంటున్నారు. మంగళవారం విద్యార్థులు యథావిధిగా పడుకున్నారు. అర్ధరాత్రి ఒక్కసారిగా పైన కారిడార్‌లో పొగ వ్యాపించింది. పక్కనే క్రైస్తవుల మీటింగ్ జరుగుతోంది. అక్కడ ఉన్నవారు పొగను చూసి వసతి గృహం వద్దకు వచ్చారు. మంటలు వ్యాపించటంతో విద్యార్థులు కేకలు వేస్తూ భయాందోళన చెందగా.. అందరినీ బయటకు తీసుకువచ్చారు. 8వ తరగతి విద్యార్థులు పులపాక అఖిల్ కైలా ఉదయ్, కిరణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

జెట్ కాయిల్ వల్లే ప్రమాదం..

దోమల కోసం విద్యార్థులు జెట్ కాయిల్ వెలిగించారు. కాయిల్ మంచం పక్కనే పెట్టడంతో దుప్పటికి అంటుకుని కారిడార్ మొత్తం మంటలు వ్యాపించాయి. కారిడార్‌కు ఒకే డోర్ ఉంది. మంటలు డోర్‌కు చివరి నుంచి అంటుకోవటంతో విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. లేకుంటే పెను ప్రమాదం సంభవించేది. క్రైస్తవ సమావేశానికి వచ్చిన వారు మంటలు వ్యాపించిన చోట కిటికీని బద్దలుకొట్టి మంటల్లో చిక్కుకున్న విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. జెట్ కాయిల్ దుప్పటికి అంటుకుని తొమ్మిది ఇనుప మంచాలపై ఉన్న పరుపులకు అడ్డుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. కబోర్డులు కాలిపోయాయి.

విద్యార్థులు క్షేమం

రీచ్ వసతి గృహం పక్కన క్రీస్తు మహాసభలు జరుగుతున్నాయి. వసతి గృహం నుంచి, పొగ బయటకు వ్యాపించటంతో మహాసభల్లో ఉన్న వారు చూసి పరుగులు తీశారు. గోడ దూకి వెళ్లి కారిడార్ కిటికీని పగులకొట్టారు. లోపలికి వెళ్లి విద్యార్థులను బయటకు పంపించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు.

అధికారుల పరిశీలన

సంఘటనా స్థలాన్ని అధికారులు పరిశీలించారు. తహసీల్దారు కేవీ శివయ్య, ఎంఈవో కె.రవికుమార్, బాల నేరస్థుల సంక్షేమ సర్వీసుల శాఖ జాయింట్ డైరెక్టర్ మదుసూధనరావు, స్పెషాలాఫీసర్ రామ్‌మనోహర్, డీపీవో సత్యవతి, సీడబ్ల్యుసీ సభ్యులు రాధాకుమారి, రవిభార్గవ్, రాజన్న, ఆర్‌ఎపి వెంకటపతి రాజు తదితరులు వసతి గృహ కారిడార్‌ను పరిశీలించారు. మంటలు వ్యాపించడానికి గల కారణాలను ఫైర్ ఆఫీసర్ జాన్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శ

రీచ్ విద్య సంస్థల ప్రాంగణంలోని లిటిల్ లైట్స్ అనాధ ఆశ్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం రాత్రి సందర్శించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలను అధికారులు, ఆశ్రమ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆశ్రమ సిబ్బంది అప్రమత్తం కావటంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. కూటమి నేతలు చిగురుపాటి కుమారస్వామి, వడ్రాణం హరిబాబు నాయుడు, చలమలశెట్టి రమేష్‌బాబు, నాదిండ్ల మోహన్, చిమట రవివర్మ, యార్లగడ్డ సతీష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జగన్ గ్యాంగ్ అత్యుత్సాహం

(5వ పేజీ తరువాయి)

సతీమణి పంకజ శ్రీ, సింహాద్రి రమేష్ వెళ్లారు. సబ్‌జైలులోకి వెళ్లిన తర్వాత నిబంధనల ప్రకారం పూర్తి చేయాల్సిన కార్యక్రమాలకు పావు గంటపాటు సమయం పట్టింది. జగన్, పంకజ శ్రీ, రమేష్ నుంచి సంతకాల సేకరణ పూర్తి అయిన తర్వాత ములాఖత్‌కు అనుమతించారు. బయటకు వచ్చిన తర్వాత పంకజ శ్రీ, మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో కలిసి జగన్ మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత జగన్ కాన్వాయ్‌ని కోర్టు మార్గంలో అనుమతించారు. అప్పటి వరకు ఆంక్షలు విధించిన పోలీసులు సడలించటంతో కార్యకర్తలు కాన్వాయ్ దగ్గరకు పరుగులుతీశారు. జగన్ ర్యాలీగా కారు మీద అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లారు.

కొత్త బాస్!

(5వ పేజీ తరువాయి)

ఆశించినంతగా చేరడం లేదు. వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థుల వసతి గృహాలు, ప్రాంగణం చుట్టూ ప్రహరీ, మెయిన్ గేట్, ఫార్మసీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, ఫుడ్‌కోర్టు, నూజివీడు పీజీ సెంటరులో బాలికల వసతిగృహం భవనంపై ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణాలకు తొలుత రూ.43.31 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఆ తర్వాత ఈ అంచనాలను రూ.51.19 కోట్లకు పెంచారు. నూజివీడు పీజీ సెంటరులోని భవనం నిర్మాణం మాత్రమే పూర్తిచేశారు. వర్సిటీలో వసతిగృహాలు, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాల భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. ఫుడ్‌కోర్టు భవనం మాత్రం పూర్తిచేశారు. పనులు జరగకుండానే రూ.18.77 కోట్ల బిల్లులను గుట్టుచప్పుడు కాకుండా చెల్లించేశారు. బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు పనులు ఆపేసి పత్తాలేకుండా పోయారు. ఇటీవలనే మరో రూ.2 కోట్లకు కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అంశంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా అందాయి. ఈ భవనాల పనులను తిరిగి ఎప్పటికి ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

23న మార్క్సిస్టు ఐక్య సదస్సు

గాంధీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు ఉద్యమ శత వార్షికం సందర్భంగా మార్క్సిస్టు ఆలోచనాపరుల బృందం ఆధ్వర్యంలో 'భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం-ఆవశ్యకత-అవకాశాలు-అవరోధాలు' అంశంపై ఈ నెల 23న సదస్సు నిర్వహిస్తున్నట్టు కమిటీ కన్వీనర్, హక్కుల ఉద్యమ నేత చిగురుపాటి బాస్కరరావు, ఏయూ విశ్రాంత అచార్యుడు అబ్దుల్ నూర్ బాషా తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక బుక్ ఫెస్టివల్ హాల్‌లో జరిగే ఈ సదస్సులో 17 రాష్ట్రాల కమ్యూనిస్టు, వామపక్ష నేతలు పాల్గొంటారన్నారు. దేశంలో మతోన్మాదం, నిరుద్యోగం అధికమైందని, దళితులు, మైనార్టీలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. లౌకిక రాజ్యాంగ హక్కులను హరిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో దేశంలో ప్రగతిశీల, లౌకిక శక్తుల పునరేకీకరణ అవశ్యకత ఉందన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ పురోగమన అవకాశాలు, అవరోధాలు గురించి వివిధ కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయాలను ఒకే వేదికపై నుంచి ప్రజలకు తెలియజేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు పిచ్చుక శ్రీనివాస్, సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ్‌కుమార్, రిటైర్డ్ ఇంజనీర్ ఎ.చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్టు జీవీ.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్‌లో అవినీతి!

(5వ పేజీ తరువాయి)

పి.నైనవరం రైతులను సంప్రదించాడు. దీంతో అక్కడి రైతులు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లైన్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించగా.. నివ్వెరపోయే విషయాలు వెలుగు చూశాయి. అలైన్‌మెంట్ ప్రకారం ముప్పా సేతు నారాయణ పొలం మీదుగా లే అవుట్ వెళ్లే అవకాశమే లేదని తేలింది. దీంతో సదరు రైతు ఈ విషయమై పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులను నిలదీస్తే తమకేమీ సంబంధం లేదంటున్నారు. పైగా ఆ రైతుపై చిందులు తొక్కుతూ బుకాయిస్తున్నారు. ముప్పా సేతు నారాయణకు సర్వే నంబర్ 137/1జేలో 0.462 ఎకరాల స్థలం ఉంది. టవర్ లైన్ అలైన్‌మెంట్‌ను అన్యాయంగా ఆయన పొలం మీదుగా మార్చటం వల్ల అన్యాయమైపోయాడు. పోనీ ఆ రైతుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ పరిహారం ఇచ్చిందా అంటే అదీ లేదు. ఒక రైతు పొలంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు సంబంధం లేకుండా ఏ విధంగా వేస్తారన్నది తేలాల్సి ఉంది. ఆ రైతు కోర్టులో కేసు వేసినా కూడా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నష్ట పరిహారం చెల్లించడం లేదు. టవర్ లైన్‌ను అన్యాయంగా మార్చటం వల్ల రైతులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. ల్యాంకో టౌన్‌షిప్‌ను కాపాడటం కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు భారీగా లంచాలు దిగమింగి అలైన్‌మెంట్‌ను అడ్డగోలుగా మార్చారన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ద్వారా విచారణ జరిపి బాధ్యులైన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బదిలీలలు

(5వ పేజీ తరువాయి)

బదిలీల్లో ఈయనకు మళ్లీ ఇవే బాధ్యతలతో పాటు అదనంగా దత్తత ఆలయాల బాధ్యతలను కూడా అప్పగించారు.

- పి.చంద్రశేఖర్ అనే ఉద్యోగి ప్రస్తుతం అన్నదానం, ప్రసాదం తయారీ, శానిటేషన్, వేదపాఠశాల బాధ్యతలు నిర్వహిస్తుండగా.. తాజా బదిలీల్లోనూ మళ్లీ అవే శాఖలు ఇచ్చారు.
- పి.సుధారాణి అనే ఉద్యోగిని చీరలు, ఆడిట్ అండ్ జనరల్, అకౌంట్స్, ప్రొవిజన్ స్టోర్స్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, తాజా బదిలీల్లో అవే బాధ్యతలతో పాటు అదనంగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ కల్పించారు.
- జె.శ్రీనివాస్ అనే ఉద్యోగి ఎస్టాబ్లిష్‌మెంట్, మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్స్, ట్రస్ట్ బోర్డు, సూపర్‌వైజేషన్ ఆఫ్ సెక్యూరిటీ, హోంగార్డ్స్ అండ్ సెక్యూరిటీ, అకామిడేషన్, కేశఖండనశాల, ఫస్ట్ ఎయిడ్, ఆర్‌టీఐ యాక్ట్, ధర్మపథం, దత్తత దేవాలయాలు, స్టేషనరీ, ఎంపీ ఫోమ్స్ వంటి బాధ్యతలు చూస్తుండగా కీలకమైన ఎస్టాబ్లిష్‌మెంట్, మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్స్, ట్రస్ట్ బోర్డు బాధ్యతలను తిరిగి కొనసాగించటంతో పాటు అదనంగా కనకదుర్గ ప్రభ బాధ్యతలు అప్పగించారు.
- ఎన్.రమేష్‌బాబు అనే ఉద్యోగి ప్రస్తుతం ద్వారకా తిరుమల నుంచి రిలీవ్ అయి రాగా, అకామిడేషన్, సెక్యూరిటీ సూపర్‌వైజేషన్, కేశఖండనశాల, స్టేషనరీ, ఎంపీ ఫోమ్స్, ఆర్టీఐ యాక్ట్ బాధ్యతలు కేటాయించారు.
- ఎం.శ్రీనివాస్ అనే ఉద్యోగి ప్రస్తుతం అకౌంట్స్, ఐటీ రిటర్న్స్, స్క్రూటినీలు, జీఎస్టీ రిటర్న్స్, డౌన్‌హిల్ కౌంటర్స్ సూపర్‌వైజేషన్ బాధ్యతలు చూస్తుండగా, వీటిలో కీలకమైన అక్కౌంట్స్, ఐటీ రిటర్న్స్, స్క్రూటినీ బాధ్యతలను కొనసాగిస్తూ అదనంగా మెయిన్ టెంపుల్ బాధ్యతలను చేర్చారు.
- బి.ఎస్.జగదీష్ ప్రసాద్ అనే ఉద్యోగి ఎస్టాబ్లిష్‌మెంట్, వేదపాఠశాల బాధ్యతలు నిర్వహిస్తుండగా.. తాజాగా ఎస్టాబ్లిష్‌మెంట్స్, డౌన్‌హిల్ కౌంటర్స్ సూపర్‌వైజేషన్, వేద పాఠశాల బాధ్యతలు అప్పగించారు.
- పి.సునీత అనే ఉద్యోగి పెనుగంచిప్రోలు దేవస్థానం నుంచి రిలీవ్ అయి రాగా ఆమెకు అన్న ప్రసాదం బాధ్యతలను కేటాయించారు.
- కనకదుర్గ ప్రభ ఎడిటర్‌గా ఉన్న కె.గంగాధర్‌కు మీడియా పీఆర్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వైసీపీ హయాంలో వచ్చి పాతుకుపోయారు..

పైన చెప్పుకున్న ఉద్యోగుల్లో కొందరు మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, వెలంపల్లి శ్రీనివాసరావు హయాంలో వారి సిఫార్సులతో వచ్చిన వారు ఉన్నారు. దాదాపుగా రెండేళ్ల పాటు వీరంతా ఆయా విభాగాల్లో పాతుకుపోయారు. ఇలాంటి వారిని పూర్తిగా వేరే విభాగాలకు బదిలీ చేయాల్సి ఉండగా, అదే విభాగాలకు బదిలీ చేయటం విమర్శలకు తావిస్తోంది. దేవాలయాల్లో పనిచేసే వారిని వాస్తవంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఎక్కడా ఇది అమలు కావడం లేదు. దుర్గగుడిపై గత రెండేళ్లుగా పనిచేస్తున్నా అంతర్గత బదిలీలు జరగ లేదు. వీరిలో కొందరిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 410

మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పెద్దయెత్తున తరలివస్తున్నారు. తిరునాళ్లలో 11వ రోజైన మంగళవారం తెల్లవారు జామునుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పొటేళ్ల ప్రభబళ్లు, మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ చీర, సారెతో వేడుకగా వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారి శిడిబండి వేడుక కూడా కావడంతో పలు ప్రాంతాలనుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



పొటేళ్ల బండితో ఆలయానికి వస్తున్న భక్తులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, హెచ్‌వోడీలు

గ్రహణం మొర్రిపై అవగాహన

గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రహణం మొర్రి ఆపరేషన్‌లను ఉచితంగా చేస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ మూల్పూరి వెంకట రామోజీరావు తెలిపారు. మండలంలోని ముస్తాబాద జడ్పీ హైస్కూల్‌లో ఓరల్ అండ్ మాక్సిలో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రహణం మొర్రిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామోజీరావు మాట్లాడుతూ, పెదవి, అంగిలి చీలిక అనేది శాపం కాదని చెప్పారు. చిన్నతనంలో ఏర్పడే పెదవి చీలికతో ఆత్మన్యూనతకు గురవుతారని అలా చింతించాల్సిన అవసరం లేదన్నారు. అంగిలి, పెదవి చీలికకు శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్రహణం మొర్రి ఉన్నవారికి చిన్నతనంలోనే ఆపరేషన్ చేస్తే వయస్సు పెరిగేకొద్ది శరీరం మొత్తం కలసిపోతుందని చెప్పారు. నెలకు 16 ఆపరేషన్‌లు ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు గ్రహణం మొర్రి ఉన్నవారికి ధైర్యం కల్పించి అండగా నిలవాలన్నారు. హెచ్‌వోడీలు డాక్టర్ ఎన్.కోటేశ్వరరావు, రవిచంద్రశేఖర్ నాయుడు, శ్రీకాంత్ గుంటూరు, వసుధ, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీపతి రామ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

కంకిపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసులపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో అరెస్టు అయిన వంశీని కలిసేందుకు వచ్చిన జగన్ పోలీసుల గుడ్డలు ఊడదీసి కొడతామంటూ హెచ్చరికలకు దిగడం దురదృష్టకరమన్నారు. పోలీసులు జగన్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సాయినగర్ ఫీడర్, 11కేవీ బందరు రోడ్డు ఫీడరు పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరాకు ఉదయం 7.30 నుంచి 12గంటల వరకు అంతరాయం కలుగుతుందని గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. సాయినగర్, పుట్ట రోడ్డు, మాదు తిరుపతిరావు నగర్ టవర్ రోడ్డు, శివపార్వతి నగర్ ఏరియా, డొంక రోడ్డు, కోడూరు కాలనీ, జన్మభూమి వంతెన ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

జగనన్న భూభక్ష!

- తప్పుల తడకగా రీసర్వే
- రికార్డుల్లో పేర్లు మారటం, విస్తీర్ణం తగ్గడం లాంటి సమస్యలతో రైతులు సతమతం
- రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేసినా పరిష్కారం శూన్యం
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు

(హనుమాన్‌జంక్షన్‌రూరల్ - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి కృష్ణాజిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న భూరక్షలో భాగంగా జరిగిన రీసర్వే తప్పుల తడకగా మారటంతో అనేక మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. తమ భూములు వేరే వారి పేర్లతో రికార్డులు మారటం, విస్తీర్ణం తగ్గడం లాంటి సమస్యలతో నెలల తరబడి ఇబ్బంది పడుతూ రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. రెవెన్యూ సదస్సుల్లో, అధికారుల సమక్షంలో ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాకపోవడం, పట్టాదారు పాసు పుస్తకాలున్నా రిజిస్ట్రేషన్లు నిలిపివేసారు. భూముల విలువ పెరగడంతో ఇప్పుడు తలకు మించి భారమవుతోందని, భూసమస్యలు ఎప్పటికి పరిష్కారమవుతాయో తెలియని స్థితిలో రైతులున్నారు.



కొత్తపల్లి పంచాయతీ చెరువును ఆక్రమించి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట

నా పొలం రికార్డుల్లో మారిపోయింది



తనకు పల్లెర్లమూడిలో 2.90 ఎకరాలు ఉంది. వైసీపీ హయాంలో జరిగిన రీసర్వేలో భూమి మొత్తం రికార్డుల్లో మరొకరి పేరు మీద మారింది. మీకోసంలో దరఖాస్తు చేయగా మీపేరుతో భూమి లేదని.. వేరే పేరు మీద ఉందని, అతను నుంచి లేఖ తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తామని వీఆర్వో సలహా ఇచ్చాడు. పేరు ఉన్న అతను మరణించి పదేళ్లవుతుంది.

గారపాటి విజయ మోహన్, పల్లెర్లమూడి

● కొయ్యూరుకు చెందిన మూల్పూరి వాసుకు ఎకరా భూమి ఉంది. రికార్డుల్లో 0.42 సెంట్లు మాత్రమే చూపుతున్నాయి. తనకు తెలియకుండా సర్వే జరగడం, భూవిస్తీర్ణం తగ్గిపోవడంతో స్థానిక అధికారులను కలిశారు. రామిలేరుకు వచ్చిన వరదల్లో భూమి కొట్టుకుపోయి ఉంటుందని సమాధానం ఇవ్వడంతో కంగుతిన్నాడు.

● కొయ్యూరులో వేగుంట బీనాకుమారికి 1.53 ఎకరాల భూమికిగాను 1.50 ఎకరాలు మాత్రమే ఉంది. మిగిలిన మూడు సెంట్లు తెలాల్సి ఉంది. అలాగే ఆమె తల్లి సీతామహాలక్ష్మికి చెందిన 88 సెంట్లు రీ సర్వే అనంతరం రికార్డుల్లో కనిపించడం లేదు. భూ విస్తీర్ణం తక్కువగా నమోదవడంతో గత ఐదు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా చూద్దాం అంటూ సమాధానం, స్థానిక సర్వేయర్ భూమి అక్కడే ఉందికదా కంగారు ఎందుకు సరిచేస్తాలే అంటూ ఈసడించుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

●ఎస్.ఎన్.పాలెంలో పట్టాదారు పాసుపుస్తకాలు ఉండి,సాగు చేసుకుంటూ ఈక్రాప్‌లో కూడా నమోదైన కంపసాటి లక్ష్మికి చెందిన ఎకరం భూమి మొత్తం రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైంది. గత ఫిబ్రవరిలో దీనిపై ఫిర్యాదు చేసినా, రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందజేసినా ఇంత వరకూ పరిష్కారమవ్వలేదు.

● రంగన్నగూడెంలో రైతులు కలిసి వేసుకున్న రోడ్లను ప్రభుత్వ భూమిగా మార్చేయడంతో రెవెన్యూ సదస్సుల్లో వాటికి ప్రత్యేక ఎల్‌పీ నెంబర్లు కేటాయించాలని వినతిపత్రం అందజేసినా ఇంత వరకూ సమస్య పరిష్కారం కాలేదని రైతులు వాపోతున్నారు.

● కొత్తపల్లికి చెందిన 14 ఎకరాల చెరువును కొందరు ఆక్రమించుకొని ఆయిల్‌పామ్ సాగు కూడా చేసుకుంటున్నారు. పక్కనే ఉన్న తమ సాగుభూమితో పాటు పట్టాదారు పాసుపుస్తకాల అధారంగా షుమారు నాలుగు ఎకరాల మేరకు చెరువును ఆక్రమించి సాగు చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ మురళీకృష్ణ ఇటీవలే పంచాయతీ అధికారులకు నోటీసు ఇచ్చినా చలనం లేదంటే పరిస్థితి అర్థమౌతోంది.

తప్పులు సరి చేస్తాం

● తహసీల్దార్ మురళీకృష్ణ

మండల పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆధార్ లింకు, పేర్లు తప్పుగా నమోదైన విషయాల్లో స్థానిక రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మార్పులు, చేర్పులు చేయడం జరుగుతుందని తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. మండల పరిధిలో వచ్చిన 253 ఫిర్యాదులకు గాను ఇప్పటివరకూ 240కి పైగా ఫిర్యాదులను పరిష్కరించామని, సర్వేలో వచ్చిన తప్పులపై మండల సర్వేయర్ ఆధ్వర్యంలోని సర్వేయర్లు క్షేత్రస్థాయిలో రైతుల సమక్షంలో కొలతలు నిర్వహిస్తున్నారని, ఇంకా ఏమైనా తప్పులు దొర్లితే దరఖాస్తు చేసుకుంటే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.





పోరంకిలో మాట్లాడుతున్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి.. కానూరు జనసేన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బండి రామకృష్ణ

ఆలపాటి రాజాను గెలిపించుకుందాం

రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

పెనమలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజాను అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పోరంకి, యనమలకుదురులోని ప్రైవేటు పాఠశాలల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, శేషాద్రి పాల్గొన్నారు.

రాజా విజయానికి కృషి చేయాలి : జనసేన నేత బండి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించి శాసనమండలికి పంపించాలని బందరు పార్లమెంటు జనసేన సమన్వయకర్త బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కానూరు జనసేన కార్యాలయంలో జరిగిన ఎన్నికల సమీక్షలో ఆయన పాల్గొన్నారు. తాడిగడప జనసేన అధ్యక్షులు తాతపూడి గణేష్ మాట్లాడుతూ, తాడిగడప మునిసిపాలిటీలో ఉన్న 8,500 పట్టభద్రుల ఓట్లను ఆలపాటి రాజాకు నమోదయ్యేట్లు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ హోదా ల్లో ఉన్న జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నిడమానూరులో యార్లగడ్డ ఆత్మీయ సమావేశం

ప్రసాదంపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపు నిచ్చారు. మంగళవారం నిడమానూరులో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.ఎస్ బేగ్, హరిబాబు, చిరుమామిళ్ల సూర్యం, గొడ్డళ్ల చిన్న రామారావు, గూడవల్లి నరసింహారావు, బండి వెంకట్రావు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, చిత్రంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

● పట్టభద్రుల ఆలోచనలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కృషి చేస్తారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళవారం ప్రసాదంపాడులోని వివేకానంద స్కూల్‌లో పట్టభద్రుల ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడవల్లి నర్సయ్య, టీడీపీ నాయకులు సర్నాల బాలాజీ, బొప్పన హరికృష్ణ, దొంతు చిన్నా, నెక్కంటి శ్రీదేవి, దాసరి మహేష్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటికి మద్దతు పలకాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఓటువేసి గెలిపించాలని టీడీపీ నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్, మండాది రవీంద్ర కోరారు. వీరవల్లిలో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రులను ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా మొదటి ప్రాధా న్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్, రాజేష్, ఆనంద్ పాల్గొన్నారు.



జేసీ గీతాంజలిశర్మకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

వేలేరు రైల్వేలైన్ సమస్యపై జేసీ పరిశీలన

● మట్టి దోపిడీదారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల వినతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : విజయవాడ-విశాఖపట్నం రైల్వేలైను వేలేరు గ్రామం మధ్య నుంచి వెలుతుండటం దానికి గల ఎల్.సీ నెం 334 రైల్వే గేటు శాశ్వతంగా మూసి వేయడం వల్ల గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారనే సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజ లిశర్మ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేలేరులోని రైల్వేగేటును ఆర్డీఓ బాలసుబ్రహ్మ ణ్యం, తహసీల్దార్ మురళీకృష్ణ, రైల్వే అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఇదే సమయంలో గ్రామంలోని 13 చెరువుల నుంచి మట్టి అక్రమంగా దోపిడీ చేస్తూ అడ్డుకున్న గ్రామస్తులు, టీడీపీ నాయకులపై కేసులు పెట్టారని, దోపిడీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కోతులతో రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తదితర సమస్యలపై వినతిపత్రాన్ని జెసీ గీతాంజలిశర్మకు వేముపల్లి శ్రీనివాసరావుతో కలిసి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అవిర్నేని భవానీశంకర్, కడియాల సాంబశివరావు, టీడీపీ అధ్యక్షుడు కాజ సురేష్, రామ్మోహన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెదవేగి మండలం వేంపాడు గ్రామానికి చెందిన సాయిల థామస్ (65) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై వి.సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న థామస్ ద్విచక్ర వాహనంపై ఏలూరు నుంచి జంక్షన్ వైపు వస్తుండగా ఎదురుగా వెళ్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన థామస్‌ను వైద్యసాయం కోసం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

చలో మచిలీపట్నం జయప్రదం చేయాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నిబంధ నలకు విరుద్ధంగా నిర్వహించిన చార్ట్ కౌన్సెలింగ్ రద్దుచేయాలని కోరుతూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన చలో మచిలీపట్నం కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఉయ్యూరు డిపో అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్ష 5వ రోజు మంగళవారం ఆయన ప్రారం భిం చారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి, సెక్రటరీ కేవీరావు ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమానికి మద్దతు పలికారు. టీపీరావు, జీఎస్ రావు దీక్షలో పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

డీవైఈవో ఐ పద్మారాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈవో పద్మారాణి

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలకు మెరుగైన పునాది, అభ్యసన సాధించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తలపెట్టిన జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవంతం చేయాలని డీవైఈవో ఐ పద్మారాణి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మొదటి 6 రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డీవైఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 3 నుంచి 6 సంవత్స రాల మధ్యగల పిల్లలకు మెరుగైన పునాది అభ్యసన ఫలితాలు సా ధించే ఉద్దేశంతో ప్రపంచబ్యాంక్ ఆర్థిక సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్, సమగ్ర శిక్ష స్టేట్ ఇంప్లిమెంటేషన్ సొసైటీ, ప్రథమ్ స్వచ్ఛంద సంస్థతో కలిపి ఎన్‌ఈపీ 2020 జాతీయ విద్యావిధానం సూచించిన విద్యా లక్ష్యాలు సాధించాలన్న ఉద్దేశంతో మొదటి దశ ఆరురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వ హిస్తున్నా మన్నారు. కోర్సు ఫెసిలిటేటర్ కె జ్యోత్స్న దేవి, డీఆర్పీలు పీవీ రమణ, ఎం హరిబాబు, అబ్దుల్ హబీబ్, సీఆర్పీలు రమణ, పుష్పలత పాల్గొనగా 63 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణకు హాజరయ్యారు.

భక్తాంజనేయస్వామి ఆలయానికి విరాళం

గన్నవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భక్తాంజనేయస్వామి ఆలయానికి ఉంగుటూరు మండ లం పొనుకుమాడు గ్రామానికి చెందిన వీరమాచినేని వెంకటేశ్వరబాబు రూ.72వేలు విరాళాన్ని మంగళవారం అలయ అర్చకులు రాధాకృష్ణమూర్తికి అందజేశారు. ఆ నగదును ఫిక్సిడ్ డిపాజిట్ చేసి ప్రతి ఏడాది ఆలయంలో జరిగే హనుమజ్జయంతి వేడుక రోజు జరిగే అన్నసమారాధనకు డిపాజిట్‌పై వచ్చే వడ్డీని ఉపయోగిం చాలని కోరారు. ఆలయ పునః నిర్మాణ కమిటీ సభ్యులు నెక్కలపూడి ఈశ్వరరావు, ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వెంకటేశ్వరబాబు




తిరునాళ్లు

ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్లు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. దీంతో ఉయ్యూరు సెంటర్ భక్తజనసంద్రంగా మారింది తిరునాళ్లలో అతిముఖ్యమైనది శిడిబండి వేడుక. దీన్ని కనులారా దర్శించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. వేడుక సైతం ఎంతో ఘనంగా జరిగింది.





అన్నా క్యాంటీన్లకు కోస్టల్ బ్యాంకు విరాళం


మంత్రి పయ్యావుల కేశవ్‌కు చెక్ అందజేస్తున్న కోస్టల్ బ్యాంక్ అధికారులు

లబ్బీపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నా క్యాంటీన్ల నిర్వహణకు కోస్టల్ బ్యాంకు ప్రతినిధులు ఒకరోజు వేతనాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు మంగళవారం అందజేశారు. సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన కోస్టల్ బ్యాంకు సీ.ఎఫ్.వో అండ్ సి.జి.ఎం కే.ఏ.వి రామన్, క్లస్టర్ హెడ్ టి.రామకృష్ణ చెక్ అందజేశారు. బ్యాంక్ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు.

క్లిష్టమైన భూ సమస్యలకు పరిష్కారం

● కలెక్టర్ లక్ష్మీశ

తిరువూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమక్షంలో మ్యూటేషన్, ప్రభుత్వ భూములు (22-ఏ) నమోదైన పట్టాభూములు అర్హులైన వారి భూములు పట్టా భూములుగా నమోదు చేయటం, కొన్ని సబ్ డివిజన్స్ వెబ్ ల్యాండ్‌లో నమోదు కానందున ఆయా రికార్డులు తనిఖీ చేసి వెబ్ ల్యాండ్‌లో నమోదు చేశారు. మొత్తం 45 మంది రైతులు భూ సమస్యలను పరిష్కరించారు. సర్వే సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పలు రకాల సర్టిఫికెట్లు అందించారు. తిరువూరు ఆర్డీవో కె.మాధురి, డివిజన్ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పవిత్ర సంగమాన్ని శుభ్రం చేయిస్తున్నాం



● కొండపల్లి మున్సిపల్ కమిషనర్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పవిత్ర సంగమం ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేయిస్తున్నామని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో సమస్యల సంగమం శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆమె స్పందిస్తూ డోజర్లు పెట్టి ఘాట్‌లోని బురదను తొలగిస్తున్నామన్నారు. గతంలో లక్ష నుంచి లక్ష 20వేల మంది భక్తులు ఇక్కడ శివరాత్రి పుణ్య స్నానాలు చేశారని అందుకు తగినట్టు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, భద్రతా చర్యలు చేపడుతున్నట్టు ఆమె చెప్పారు.

అరాచకవాదులకు చిరునామా జగన్ రెడ్డి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్‌రెడ్డి అరాచకవాదులకు చిరునామా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ భ్రష్టు పట్టించిన జగన్ టీడీపీ కార్యాలయాలపై దాడులు చేయించాడన్నారు. టీడీపీ అధినేత నుంచి దిగువ కార్యకర్త వరకు అందరిపైనా దాష్టీకాలు చేయించటమే కాక అక్రమ కేసులు బనాయించాడన్నారు. ఆస్తులను విధ్వంసం చేయించి పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిన జగన్ పాలన దారుణం కాక ఇంకేమవుతుందన్నారు. కేసును విత్‌డ్రా చేసేలా దళితుడు సత్యవర్ధన్‌ను హింసించి, బెదిరించిన అసాంఘిక శక్తి వంశీని అరెస్టు చేయడం దారుణమెలా అవుతుందన్నారు. సొంత తల్లిని, చెల్లిని తరిమేసిన జగన్, బాబాయిని లేపేసిన తమ్ముడు అవినాష్‌రెడ్డి, శవాన్ని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు, పేదల బియ్యాన్ని దోచేసిన పేర్నినాని, పేకాట శిబిరాలు నడిపించిన బూతుల కొడాలి నాని, గన్నవరం సైకో వంశీ వీళ్లంతా ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ప్రజలు భావిస్తున్నారన్నారు.

మహాజనసభ వాయిదా

రెండు వర్గాలుగా గుడివాడ కో-ఆపరేటివ్ బ్యాంకు సభ్యులు

● సభ జరగాలంటూ ఒక వర్గం.. వాయిదా కోసం మరో వర్గం పట్టు ● స్వల్ప రసాభాస ● కోరం లేక వాయిదా వేస్తున్నట్టు ప్రకటన



సభ్యులతో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్

గుడివాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుడివాడ అర్బన్ బ్యాంకు 110వ మహాజనసభ కోరం లేకపోవడంతో వాయిదా పడింది. సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు. కోరం లేకున్నా గతంలో నిర్వహించినట్టు సభ జరగాలంటూ ఒక వర్గం, వాయిదా వేయాలని మరో వర్గం పట్టుపట్టారు. ఎంతకూ వ్యవహారం తేలకపోవడంతో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ సభను వాయిదా వేశారు. బ్యాంకు 110వ మహాజనసభను మంగళవారం బ్యాంకు ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండు పర్యాయాలు ఇలా సభను నిర్వహిస్తారు. మొదటి సభ కూడా కోరం లేక వాయిదా పడిన విషయం విదితమే. నిబంధనల మేరకు కోరం పూర్తవ్వాలంటే 550 మంది హాజరుకావలి. కానీ మంగళవారం జరిగిన సభకు 100 మంది మాత్రమే వచ్చారు. దీంతో పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ మాట్లాడుతూ కోరం లేని కారణంగా మహాజనసభను వాయిదా వేయాలా వద్దా అని సభ్యులను కోరారు. హాజరైన సభ్యులు రెండు వర్గాలు విడిపోయారు. అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ మాట్లాడుతూ బ్యాంకు నుంచి రిజర్వు బ్యాంకుకు పంపాల్సిన నివేదికలను ఆమోదం తెలిపి పంపాలని కోరారు. సభ నిర్వహణ విషయంలో బ్యాంకు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. మాజీ డైరెక్టర్ పొట్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలోనూ కోరం లేకున్నా మహాజనసభను నిర్వహించారని, అలాగే సభ నడపాలన్నారు. లేకుంటే బ్యాంకుకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ క్రమంలో ఇద్దరు సభ్యులు వేదిక వద్దకు రావడంతో పర్సన్ ఇన్‌చార్జ్ వారిని తమ స్థానాల్లో కూర్చోవాలని సూచించారు. దీంతో సభ్యులు పర్సన్ ఇన్‌చార్జ్‌తో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. అంతేకాక సభకు పోలీసులు రావడంపై కొందరు ఆక్షేపణ తెలిపారు. సభ్యుల నుంచి సహకారం లేకపోవడంతో పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ సభను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు నడుచుకుంటామని పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ తెలిపారు.

ఘంటసాలకు స్వరనివాళి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం పరుచూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘంటసాల 51 వర్ధంతి సందర్భంగా స్వర నివాళి జరిగింది. ఈ సందర్భంగా దావులూరి వీరభద్రరావు దంపతులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. నిడమోలు రమా సత్యనారాయణ, ప్రసూనా రామన్, వీరభద్రరావు, చావా నర్సింహారావు, వడ్డాది కామేశ్వరి జయప్రభ, కొప్పుల అశోక్ ఆనంద్, వాఖ్యాత డేవిడ్‌రాజు, గాయని గాయకులు చంద్రశేఖర్, రసూల్‌బాబు, సుధారాణి, విష్ణుప్రియ, కుసుమాంజలి, శ్రీనివాస్, పర్యవేక్షణ చలపతిరావు పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించండి

పెడన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి పార్టీల శ్రేణులు సమన్వయంతో పని చేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా మంగళవారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నిక నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలసి పట్టణంలోని 20వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు.


రెవెన్యూ, పర్యావరణ, పర్యాటక, అటవీ, పంచాయతీరాజ్ విభాగాల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఎకో సెన్సిటివ్‌జోన్ మాస్టర్‌ప్లాన్ తయారీలో

జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్

మచిలీపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎకో సెన్సిటివ్ జోన్ మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేసే సమయంలో అధికారులు పూర్తిస్థాయి జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ తయారీపై రెవెన్యూ, పర్యావరణ, పర్యాటక, అటవీ, పంచాయతీరాజ్ విభాగాల అధికారులతో మంగళవారం తన చాంబర్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణా వైల్డ్ లైఫ్ సాంక్చూరీ పరిధిలో ఎకోసెన్సిటివ్ జోన్ మాస్టర్‌ప్లాన్ ఏర్పాటుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందన్నారు. ఈ సమయంలో పర్యావరణానికి విఘాతం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయాశాఖల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు భవిష్యత్తులో పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఎకోసెన్సిటివ్ జోన్‌లో చేపట్టే పనులు, చేపట్టకూడని పనులపై అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, ఆర్డీవో కే స్వాతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, పర్యాటక శాఖ జిల్లా అధికారి జి రామలక్ష్మణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నదీప్రవాహానికి అడ్డుకట్ట

ఐలూరు పుష్కరఘాట్ వద్ద నిబంధనలకు నీళ్లు

● పత్తాలేని అధికారులు ● ముడుపుల వల్లే వెనుకడుగు వేస్తున్నట్టు ఆరోపణలు


ఐలూరు పుష్కరఘాట్‌ను పూడ్చేసి నదీప్రవాహానికి ఆటంకం కలిగేలా సిమెంటు తూము పెట్టి ఎత్తుగా నిర్మించిన రహదారి


తోట్లవల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నదీపాయలో సహజ నీటి ప్రవాహానికి వ్యక్తులు ఆటంకం కలిగించకూడదని ఆర్సీ నిబంధనలున్నాయి. వరదలతో పొలాలు కోతకు గురై ఏర్పడిన మట్టి, ఇసుక దిబ్బలను అధికారుల ప్రత్యేక అనుమతితో మాత్రమే తొలగించుకోవాలి. రెవెన్యూ, మైనింగ్, భూగర్భజల శాఖల అనుమతితో మాత్రమే అలాంటి దిబ్బలను తొలగించాల్సి ఉందని ఆర్సీ నిబంధనలు చెపుతున్నాయి. కానీ పవిత్ర పుణ్యక్షేత్రమైన ఐలూరులో నిబంధనలన్నీ తుంగలో తొక్కి వ్యాపారకాంక్షతో రహదారి నిర్మించటం సంచలనంగా మారింది. పుణ్యస్నానాలు ఆచరించే ఘాట్‌ను పూర్తిగా పూడ్చివేసి దానిపై రహదారి నిర్మించిన విధానం చూస్తే అధికారుల అండదండలు పూర్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ పుష్కరఘాట్‌ని పూడ్చివేయటం ఒక నేరమైతే నదీప్రవాహానికి ఆటంకం కలిగేలా సిమెంటు తూములు ఏర్పాటు చేసి ఎత్తుగా నదీపాయలో రహదారి వేయటం మరో తప్పిదం. ఇలాంటి కఠినమైన నిబంధనలను వ్యక్తులు ఉల్లంఘించి వ్యాపార అవసరాలకు రహదారి నిర్మించినా సదరు రివర్ కన్జర్వెన్సీ అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం 'పుణ్యస్నానాల పుష్కరఘాట్‌ను రహదారిగా మార్చేశారు' శీర్షికన వార్తా కథనం వెలువడిన సంగతి తెలిసిందే. మంగళవారం పుష్కరఘాట్‌పై పోసిన ఇసుక, మట్టిని తొలగించి ఘాట్‌ను పునరుద్ధరిస్తామని చెప్పిన అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించలేకపోయారు. రహదారి నిర్మించిన వ్యక్తి నుంచి కొందరు అధికారులు ముడుపులు స్వీకరించినందు వల్లే ఘాట్‌వైపు రాలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మట్టి కొట్టొద్దు!

మట్టిని నమ్ముకుని బతుకుతున్నాం.. మట్టినే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నాం. మాకెలాంటి మర్మాలు తెలియవు. దాదాపు నాలుగైదు తరాల నుంచి మేమిక్కడే జీవిస్తున్నాం. ఉన్నపళంగా మమ్మల్ని వెళ్లిపోమంటున్నారు.. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి? మా పక్షాన నిలిచేదెవరు? మా వెనుక నిలబడి పోరాటం చేసేదెవరు? మాకు ఎలాంటి రాజకీయాలు తెలియవు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటే మేమేం చేసేది. అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కుమ్మర్లు. కనీసం మాకెక్కడైనా ప్రత్యామ్నాయ స్థలం చూపించండి.. లేదా మా బతుకు మమ్మల్ని బతకనీయండంటూ వేడుకుంటున్నారు. ప్రభుత్వ పెద్దలు తమగోడు విని ఆదుకోవాలని వారు కోరుతున్నారు..

- ఆంధ్రజ్యోతి, గుణదల /విజయవాడ రూరల్

కొత్తూరు తాడేపల్లి వద్ద మట్టి పాత్రల తయారీకి బ్రేక్


పంచాయతీ నోటీసులు


మట్టి కుండకు రూపం తీసుకొస్తున్న కుమ్మరి


అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి పాత్రలు

విజయవాడ శివారు కొత్తూరు తాడేపల్లి గ్రామంలో కుమ్మర్లు తయారు చేసిన మట్టికుండలు, ఇతర సామగ్రి తెలుగు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. ఇటు విశాఖపట్నం నుంచి అటు కడప జిల్లా వరకు మట్టి కుండలు ఎగుమతులు జరుగుతుంటాయి. కారణం వాటి తయారీకి అనువైన మట్టి వనరులు ఇక్కడ ఉండటమే. కొత్తూరు తాడేపల్లి చెరువు గట్టుపై నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడి మట్టితో తెలుగు రాష్ట్రాలకు మట్టిపాత్రలు ఉత్పత్తి చేస్తున్నారు. అనాదిగా, ఏళ్లుగా మట్టిని నమ్ముకున్న కుమ్మర్లకు పంచాయతీ షాక్ ఇచ్చింది. వెంటనే ఖాళీ చేయాలంటూ నోటీసులివ్వటంతో మట్టి పాత్రల ఎగుమతి నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. పంచాయతీ అనాలోచిత చర్యతో తెలుగు రాష్ట్రాలకు మట్టిపాత్రల ఎగుమతులపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. చేతివృత్తే ఆధారంగా మట్టికుండలు తయారు చేసే కుమ్మర్లు పేదోడి దాహార్తిని తీర్చే ప్రధానం ఆయుధమన్న విషయం తెలిసిందే. అలాంటి కుమ్మర్లకు నిలువ నీడ లేకుండా చేసే ఆలోచనతో కొత్తూరు తాడేపల్లి పంచాయతీ వారం రోజుల క్రితం నోటీసులిచ్చింది. 40ఏళ్లపాటు కొత్తూరు తాడేపల్లి గ్రామంలో చెరువు గట్టున నివాసాలు ఏర్పాటు చేసుకుని అక్కడే కుండలు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి అధికారుల నోటీసులు ఆశనిపాతంగా మారాయి. 1980లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాసు బ్రహ్మానంద రెడ్డి కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని చెరువుమట్టిని తవ్వుకుని మట్టికుండలు తయారు చేసుకోవచ్చని ఒక జీవోను విడుదల చేశారని కుమ్మర్లు చెబుతున్నారు. గ్రామంలోని గోవిందరాజుల చెరువు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో 14 ఎకరాల్లో నేటి వరకు కుమ్మర్లు మట్టి తవ్వుకుని కుండలు తయారు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. 1995లో విజయవాడ గట్టువెనుక విద్యాధరపురం రామమందిరం వీధిలో కుమ్మర్లు కుండలు తయారు చేసి జీవనం సాగించేవారు. అలాగే గుణదల కుమ్మర వీధిలో మరికొంతమంది కుండలు తయారు చేసేవారు. ఆయా ప్రాంతాల్లో జనావాసాలు పెరగటంతో ఇళ్లమధ్యన మట్టికుండల బట్టీల నుంచి వచ్చే పొగ వల్ల ఇబ్బందులు వస్తున్నాయమని అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ అక్కడి తమనంతా కొత్తూరు తాడేపల్లికి తరలిపోవాల్సిందేనని చెప్పడంతో ఇక్కడకు చేరుకున్నామని కుమ్మర్లు చెబుతున్నారు.

ఇప్పుడు ఇక్కడ కూడా ఖాళీ చేయాలని నోటీసులిచ్చారు కానీ ప్రత్యామ్నాయం చూపించలేదు. జంపన శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి ఏపీలో ఉన్న చెరువులు, చెరువు గట్లను పరిరక్షించాలని లోకాయుక్తను ఆశ్రయించడం జరిగింది. దీంతో లోకాయుక్త ఒక సర్క్యులర్ ఇవ్వడంతో ఆయా పంచాయతీల పరిధుల్లో ఉన్న చెరువుగట్లపై నివాసాలు ఏర్పరచుకున్న వారిని ఖాళీ చేయించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎల్‌పీవో ఆయా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అక్కడ జీవనం సాగిస్తున్న 50 మంది కుమ్మర్లకు వారం క్రితం నోటీసులిచ్చారు. పదిరోజుల నుంచి ఎండ తీవ్రత పెరిగిపోతోంది. దీంతో ఈ ఏడాదైనా వ్యాపారం లాభసాటిగా ఉంటుందని కొండంత ఆశతో ఎదురు చూస్తున్న కుమ్మర్లకు పంచాయతీ నోటీసులతో ఆశలన్నీ నీరుగారిపోయాయి. ఉన్న కుండలను సొమ్ము చేసుకుని కొత్తగా కుండలు తయారు చేయాలా వద్దా అన్నా డైలమాలో పడిపోయామని చెబుతున్నారు.


నీడలో ఆరబెట్టిన కుండలు


ఇతర జిల్లాలకు రవాణా అవుతున్న కుండలు

ఈతరంవారెవరూ అంతగా మట్టి కుండల తయారీకి ఆసక్తి కనబర్చడం లేదు. గతంలో కుమ్మర వృత్తిపై ఆధారపడి నగరంలో దాదాపు 200 కుటుంబాలుండేవి. ప్రస్తుతం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో 50 కుటుంబాలే ఉన్నాయి. వీరికి కూడా నిలువ నీడ లేకుండా చేస్తే ఇక ఈ వృత్తిపట్ల ఆసక్తి కనబర్చడానికి ముందుకు వచ్చేవారే ఉండరన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

పంచాయతీ అనాలోచిత నిర్ణయం.. కుమ్మర్లకు శాపం

తెలుగు రాష్ట్రాలకు మట్టిపాత్రల ఎగుమతి అధికంగా ఇక్కడి నుంచే

అసలే అంతరించిపోతున్న కుమ్మర్ల పని.. ఉన్నవాళ్లను పంపేస్తే ఎలా ?

ప్రత్యామ్నాయం చూపకపోగా ఖాళీ చేయాలంటూ నోటీసుల జారీ

ఆందోళన వ్యక్తం చేస్తున్న కుమ్మర్లు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్ 110, 119, 130

చికెన్ విత్ స్కిన్ 210

చికెన్ స్కిన్‌లెస్ 220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 410

పేదల కడుపు నింపడమే పవన్ ఆశయం

గుడివాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పేదల కడుపు నింపడమే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం అన్నక్యాంటీన్‌లో గుడివాడ మండలం దొండపాడుకు చెందిన జనసేన నాయకులు కాకి రాంబాబు వర్ధంతి సందర్భంగా కాకి బాబ్జీ ఆధ్వర్యంలో ఉచితంగా భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శాయన రాజేష్, మండల అధ్యక్షులు ఇంటూరి గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న జనసేన నాయకులు

ఆర్‌కే వారియర్స్ రక్తదానం

గుడివాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : ఏరియా ప్రభుత్వాసుపత్రిలో పట్టణానికి చెందిన జానకి అనే మహిళకు అత్యవసరంగా శస్త్రచికిత్సకు రక్తం అవసరమవ్వడంతోస్పందించిన ఆర్‌కే వారియర్స్ విశ్వేశ్వరరావు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా టూటౌన్ బీజేపీ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) విశ్వేశ్వరరావును అభినందించారు. రక్తదాత విశ్వేశ్వరరావును గాదె చరణ్, శివ, శ్యాం అభినందించారు.

గంగానమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గ్రామ దేవత గంగానమ్మ ఆలయ జీర్ణోధరణకు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ పోలవరపు జగదీశ్వరరావు రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. అయన సోదరి డిగ్రీకళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ రూ. పదివేలు కమిటీ సభ్యులు వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పోలవరపు వెంకటరావు, పొట్లూరి రవికుమార్‌లకు అందజేశారు.



అక్కినేని కళాకేంద్రంలో అన్నసమారాధన

అన్నసమారాధన

నందివాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు పెళ్లి రోజు సందర్భంగా మండలంలోని వెంకట రామాపురం గ్రామస్థులు మంగళవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వెంకట రామపురం సెంటర్‌లో అక్కినేని కళాకేంద్రంలో మెరుగు మాల లక్ష్మణరావు, రామకృష్ణా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పామర్రు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పామర్రు పట్టణ పరిధిలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సాంకేతిక మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 6 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పామర్రు డీఈఈ సుందరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోదారులు సహకరించాలని కోరారు.



పెన్షన్‌దారుల వివరాలు సేకరిస్తున్న వైద్యబృందం

వేగవంతంగా పెన్షన్ల వెరిఫికేషన్

పెదపారుపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యలమర్రులో పెన్షన్ వెరిఫికేషన్‌ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వి.పూర్ణిమ, ఆర్థోపెడిక్ డాక్టర్ సి.హెచ్.శ్రీకాంత్ పెన్షన్ లబ్ధిదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అనర్హుల పెన్షన్ లబ్ధిదారులకు వెరిఫికేషన్ కోసం ఈ కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి డి.సి.హెచ్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం ప్రచారం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కె.ఎస్.లక్ష్మణరావుని గెలిపించాలని సీపీఎం నాయకులు మంగళవారం తోట్లవల్లూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వోద్యోగులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. మండల సీపీఎం కార్యదర్శి కె.కొండలబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జె.ఏజేబు, రిటైర్డ్ ఎంఈవో కె.విశ్వనాథ్, మరీదు మౌళి తదితరులు పాల్గొన్నారు.



కార్తీకేయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

డా.కెకెఆర్స్ విద్యార్థి ప్రతిభ

గుడివాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన ఆలిండియా సలంబం ఫెడరేషన్ చాంపియన్‌షిప్‌లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి బి.కార్తీకేయ ద్వితీయ స్థానం సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థి కార్తీకేయ, కోచ్ వెంకటేశ్వరరావులను ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, సత్మారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.





పుల్లలపాడు శ్మశానంలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ దహనవాటిక భవనం.. నిర్మాణం మధ్యలో నిలిచిన మున్సిపల్ నైట్ షెల్టర్

అసంపూర్తి!

- మధ్యలో నిలిచిన పుల్లలపాడు విద్యుత్ దహనవాటిక
- మొండిగోడలతో నైట్ షెల్టర్
- వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్ల నిర్వాకం
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

పట్టణంలో వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్‌ల నిర్వాకంతో రెండు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పుల్లలపాడు శ్మశానవాటికలో విద్యుత్ దహనవాటిక, మండపాడులోని నైట్ షెల్టర్ మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. అలాగే మున్సిపల్ అధికారులు వాటిపై దృష్టిసారిస్తున్న పరిస్థితిలు కనిపించడంలేదు.

నాలుగేళ్లుగా నిర్మాణంలోనే...

కరోనా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణంలో విద్యుత్ దహనవాటికను నిర్మించాలని ఆదేశాలు జారీ చేశాయి. అందులో భాగంగా పుల్లలపాడు శ్మశానవాటికలో విద్యుత్ దహనవాటిక నిర్మాణ పనులకు వెంటనే శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు దక్కించుకున్న వైసీపీ అనుకూల కాంట్రాక్టర్ 30శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. కానీ రూ.74.5లక్షల బిల్లులను కాంట్రాక్టర్ తీసుకున్నట్లు సెంట్రల్ ఆడిట్ కమిటీ తేల్చింది.

మొండిగోడలతో నైట్ షెల్టర్..

పట్టణంలోని వీధి బాలలు, యాచకులు, వృద్ధులకు రాత్రి నివాసం ఉండటానికి మండపాడులో రూ.47.50లక్షల మెప్మా నిధులతో నైట్ షెల్టర్ నిర్మాణం రెండేళ్ల క్రితం ప్రారంభించారు. దీనిని కూడా వైసీపీ నాయకుడు కాంట్రాక్టు దక్కించుకున్నాడు. 30శాతం పనులు కూడా పూర్తి చేయకుండానే రూ.30లక్షల మేర బిల్లులను చేసుకున్నట్లు తెలుస్తోంది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, దీంతో గోడలు బీటలు వారాయని, శ్లాబు కూడా పటిష్టంగా లేదని సెంట్రల్ ఆడిట్ కమిటీ అభ్యంతరాలు తెలిపినట్టు సమాచారం.

నోటీసులకు స్పందించని కాంట్రాక్టర్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణాలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు నాలుగు సార్లు నోటీసులిచ్చినా వాటికి సమాధానం కూడా ఇవ్వలేదని సమాచారం. మున్సిపాల్టీలో చక్రం తిప్పిన మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశికి సదరు కాంట్రాక్టర్ నమ్మినబంటు కావడంతోనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని కార్యాలయవర్గాలంటున్నాయి.

మున్సిపల్ అధికారుల చర్యలు నిల్..

నోటీసులకు సమాధానం యివ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా కాంట్రాక్టర్ పట్ల చర్యలకు మున్సిపల్ అధికారులు ముందుకు రావడం లేదు. బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, అదనంగా బిల్లులను తీసుకుని ఉంటే వారి నుంచి రికవరీ చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. ఆ దిశగా అధికారులు దృష్టిసారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అసంపూర్తి భవనాలను పూర్తిచేస్తాం



అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణ పూర్తి చేస్తాం. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నుంచి భవనాల స్థితిగతులను తెలుసుకుని, త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



మొవ్వలో ప్రాక్టికల్స్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

కూచిపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్స్ మంగళవారంతో ముగిసాయి. మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం సైన్స్ గ్రూపు విద్యార్థులకు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభమైయ్యాయి. ఎంపీసీలో 32, బైపిసిలో 31 మంది విద్యార్థులు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా డి.సుధాకర్ వ్యవహరించారు.



పంటకాల్వ తవ్వుతున్న ఉపాధి కూలీలు

ముమ్మరంగా ఉపాధి పనులు

కూచిపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మొవ్వ మండలంలో మంగళవారం చేపట్టిన వివిధ పనులకు సంబంధించి 965మంది కూలీలు పాల్గొన్నారు. 141 గ్రూపులకు చెందిన కూలీలు మొవ్వ, కూచిపూడి, చినముత్తేవి, నిడుమోలు, పెదపూడి తదితర గ్రామాల్లో పంట కాల్వల్లో పూడికతీత, పక్కా గృహాల మెరక పనులు, పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనుల్లో పాల్గొన్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శేషగిరిరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కూచిపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మొవ్వ శివారులో సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కూచిపూడి ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గుంతలను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

ఎట్టకేలకు గుంతల రోడ్డుకు మోక్షం

ప్రారంభమైన తోట్లవల్లూరు - ఉయ్యూరు రోడ్డు మరమ్మతులు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు - ఉయ్యూరు ఆర్ అండ్‌బీ రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. రెండు రోజుల నుంచి చదును పనులు చేపట్టారు. రూ.40 లక్షలతో చేపట్టిన పనులను జనవరి 21న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పూజచేసి ప్రారంభించారు. ఉయ్యూరు బస్టాండ్ నుంచి తోట్లవల్లూరు వరకు 4 కిలో మీటర్ల రోడ్డుకు మరమ్మతులు చేయనున్నట్టు ఏఈ మల్లికార్జున్ తెలిపారు. తోట్లవల్లూరు వద్ద మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో తోట్లవల్లూరు నుంచి ఉయ్యూరుకు రాకపోకలు సాగించే వాహనాలు భద్రిరాజుపాలెం రోడ్డు నుంచి చెరువు మీదుగా సబ్‌స్టేషన్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయి.

తూడు తొలగింపు పనులు చేపట్టాలి



నందివాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాల్వలో తూడు తొలగింపు పనులు జరిగేనా అని మండల డీసీ అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు నంబూరి రాకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూడు తొలగింపు పనులకు తక్కువకు టెండర్లు వేసి డబ్బులు సంపాదించుకోవటం తప్ప తూడు తొలగింపు పనులు చేయటం లేదన్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు చేయటం తప్ప కాల్వల్లో తూడు తొలగింపు పనులు చేస్తున్నదీ.. లేనిది అధికారులు చూసిన దాఖలు లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టరుతో చంద్రయ్య కాల్వలో తూడు తొలగింపు పనులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై డ్రైనేజీ ఏఈ అనిల్‌ను వివరణ కోరగా, కాంట్రాక్టరుకు చెప్పాం. అయినా వచ్చిన వెంటనే పనులు మొదలు పెడతామన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణను సద్వినియోగపర్చుకోండి

కూచిపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు, అంగన్వాడీల ఆవశ్యకత, ఉపయోగాలు తదితర అంశాలపై వారం రోజులపాటు నిర్వహించే జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలను మంగళవారం మొవ్వ జడ్పీ పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాలను సద్వినియోగపర్చుకుని ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని ఎంఈవో-2 కె.శ్రీలక్ష్మీ సూచించారు. అంగన్వాడీల నిర్వహణ సక్రమంగా నిర్వహించటానికి ఈ శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని సీడీపీవో డి.సుధారాణి తెలిపారు.



పెదపారుపూడిలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీలు



మొవ్వలో శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీలక్ష్మి

కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శివకోటేశ్వరరావు, డీఆర్‌పీలు శివకుమార్, రోహిణి కుమార్, పుణ్యవతి, సలీమున్నీసా, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి : జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఎంఈవో-2 వి.సురేష్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ట్రైనింగ్‌లో నేర్చుకున్న విషయాలను కేంద్రంలో చేయాలని కార్యకర్తలకు సూచించారు. డీఆర్పీలు శివశంకర్, శ్రీదేవి, నాగజ్యోతి, ఎం.శివ నాగమణి, అరుణకుమారి మాట్లాడుతూ బాల్యారంభ సంరక్షణ, విద్య గురించి వివరించారు. మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణాధ్యక్షులు దింట్యాల

ఎమ్మెల్సీగా ఆలపాటికి అవకాశం కల్పిద్దాం

గుడివాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఒక్క అవకాశమిచ్చి గెలిపించాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు కోరారు. షైనింగ్ స్టార్ పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు చేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సయ్యద్ జబీన్, కరీముల్లా, పట్టపు చిన్న, గఫార్, మోబీన్, షైనింగ్ స్టార్ పాఠశాల కరస్పాండెంట్ లింగమనేని స్రవంతి పాల్గొన్నారు.

కూచిపూడి : కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు విజయకుమార్ పిలుపునిచ్చారు. మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపంలో మంగళవారం పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో లింగమనేని రామలిం గేశ్వరరావు, ప్రవీణ్ చంద్ర, తాతినేని పూర్ణచంద్రరావు, వర్ల చాణిక్య, మండవ రత్నగిరిరావు, మండవ శ్రీకృష్ణ, వీరంకి తులసీదాస్, శీలం బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మొవ్వలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు విజయకుమార్

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి

ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేయటం వల్ల ఖర్చు తగ్గించుకోవచ్చునని ఏవో బోలెం అనం తలక్ష్మి తెలిపారు. కల్వపూడి అగ్రహారం, గుంటాకోడూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సమస్యలు తీర్చటానికే వ్యవసాయశాఖ ముందుంటుందన్నారు. ప్రతీ రైతు వ్యవసాయ శాఖ సూచనలు,న సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. మినుము పంటను రక్షించుకోవటానికి రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.410



ఎస్పీ గంగాధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

మర్యాదపూర్వక కలయిక

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్‌లో వదోదర డివిజన్ ఎస్పీగా పని చేసి బదిలీపై మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీనివాసరావు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావుకు ఎస్పీ గంగాధరరావు శుభాకాంక్షలు తెలిపారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి మాధవీలత

భయం విడిచి పరీక్ష రాయండి

మోపిదేవి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసిక స్థైర్యం కలిగి ఉండాలని గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి టి.మాధవీలత అన్నారు. గురుకుల సొసైటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆమె గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఇంటర్, పదవ తరగతి విద్యార్థులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అతి తక్కువ సమయం ఉన్నందున ఇంటర్ విద్యార్థులు భయాన్ని విడిచి పరీక్షలకు సంసిద్ధులు కావాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లోనూ అత్యధిక మార్కులు సాధించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పాఠశాలలో వసతులపై ఆమె విద్యార్థులను ప్రశ్నించగా, వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వీరరవి, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రామకృష్ణయ్య

అవగాహనతో చట్టాలను గౌరవించాలి

పెడన రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చట్టాలను అవగాహన చేసుకుని వాటిని అనుసరించాలని లోక్‌అదాలత్ జడ్జి యు.వి.రామకృష్ణయ్య అన్నారు. నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో మోటారు వాహన చట్టాలు, సాంఘిక చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామకృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పానీయాలువంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. జిల్లా రవాణా అధికారి బి.ఎస్.శ్రీనివాస నాయక్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె నారాయణస్వామి, సీనియర్ న్యాయవాది సిహెచ్ మునలయ్య, కళాశాల ఛైర్మన్ జి.ఎం.ప్రసాద్, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరెక్టర్ డి.బాబా, ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

మోపిదేవి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే కుటుంబ సమేతంగా మంగళవారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కాంతిలాల్ దండే ఆలయంలోని నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను వారికి అంద జేశారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, సహాయక సిబ్బంది ఉన్నారు.



అక్రమ లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న టీపీవో సుజనకుమారి

అనధికార లే అవుట్ ధ్వంసం

పెడన, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమ లే అవుట్‌ను మునిసిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. గుడివాడ రోడ్డు పక్కన 301 సర్వే నెంబరులో దొరవారిగుంట స్థలంలో అక్రమ లే అవుట్ వేశారు. మునిసిపాలిటీ అనుమతులు లేని లేఅవుట్‌ను టీపీవో సుజనకుమారి మంగళవారం సిబ్బందితో వెళ్లి ధ్వంసం చేశారు. టీపీవో సుజనకుమారి మాట్లాడుతూ, అక్రమ లే అవుట్లపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనేవారు తీవ్రంగా నష్టపోతారని ఆమె హెచ్చరించారు. వారికి మునిసిపాలిటీ ఎటువంటి సదుపాయాలు కల్పించదని ఆమె స్పష్టం చేశారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్, ప్లానింగ్ సెక్రటరీలు కాగిత ప్రదీప్, రాజులపాటి కిరణ్‌రాజులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి విశ్వహిందూ పరిషత్ కృతజ్ఞతలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నుంచి ప్రయాగరాజ్‌కు రైళ్లు నడపాలని విశ్వహిందూ పరిషత్ చేసిన విజ్ఞప్తికి స్పందించిన ప్రధాన మంత్రి మోదీకి జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడికి లేఖ రాయగా స్పందించడంతో, ఈనెల 8, 16 తేదీల్లో మచిలీపట్నం నుంచి ప్రయాగరాజ్‌కు రైలు వెళ్లడం జరిగిందని శ్రీనాథ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. రైలు ఏర్పాటు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన వారిలో విశ్వహిందూ పరిషత్ నాయకులు వద్రై రాజశేఖర్, అల్లూరి కాంతారావు, బీజేపీ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, చిన్నకోట సుబ్బారావు, కూనపరెడ్డి బ్రహ్మయ్య, కూనపరెడ్డి శ్రీనివాస్, హిమశేఖర్, జుజ్జూరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.





రైతుమేళాను ప్రారంభిస్తున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన తిలకిస్తున్న రైతులు

మేలైన విత్తనాలు అందించడమే లక్ష్యం

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి

ఘంటసాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుకు మేలైన విత్తనం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. ఘంటసాల వ్యవసాయ పరిశోధనా స్థానంలో మంగళవారం నిర్వహించిన కిసాన్ మేళాలో వరి మాగాణుల్లో అపరాల సాగు - సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జ్యోతి వెలిగించి కిసాన్ మేళాను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని లాభాల బాట పట్టించేందుకు శాస్త్రవేత్తల బృందం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఆయా ప్రాంతాలు, వాతావరణ పరిస్థితులు, భూములకనుగుణంగా నూతన వంగడాలను సృష్టించి రైతులకు అందిస్తున్నామన్నారు. నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, సాగు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల రైతులు వెంకట్రావు, కూరపాటి లక్ష్మీనారాయణ, ఏ.శ్రీనివాస్, మోహన్ తదితరులు అపరాల



ఆయిల్‌పామ్ స్టాల్‌ను తిలకిస్తున్న విద్యార్థులు, రైతులు

పంటలో కలుపు సమస్య, బంగారు తీగ, చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై సందేహాలను లిఖితపూర్వకంగా అందజేయగా, శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి నివృత్తి చేశారు. వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త వి.సత్యప్రియ లలిత తాము చేస్తున్న కృషిని వివరించారు. పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఎన్.వి.వి.ఎస్.దుర్గా ప్రసాద్, విస్తరణ సంచాలకులు డాక్టర్ వి.శివనారాయణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కృష్ణంరాజు, డాక్టర్ సుధారాణి, కె.నాగేంద్రరావు, జ్యోతి, మోహన్‌రెడ్డి, సి.వి.చంద్రమోహన్ రెడ్డి, డి.ఆదిలక్ష్మి, ఎస్.రాజామణి, డాక్టర్ ప్రతిభాశ్రీ, చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పద్మావతి, శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శన స్టాల్స్

కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, చేనేత వస్త్రాల ప్రదర్శన, ఆగ్రో ప్రొడక్ట్స్ వారి ప్రదర్శనలు, ఆయిల్ పామ్ ప్రదర్శన, వ్యవసాయ యాంత్రీకరణపై స్టేట్ బ్యాంకు ఏర్పాటు చేసిన ప్రదర్శన, పశుసంవర్ధక శాఖ ప్రదర్శన రైతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో సీడ్స్ ఉత్పత్తుల గురించి సవివరంగా రైతులకు వివరించారు. ఈ ప్రదర్శనలను ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్యప్రియ లలిత, కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డా.డి.సుధారాణి తదితర శాస్త్రవేత్తల బృందం పర్యవేక్షించారు.



తెలుగు సాహితీ వైభవం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ధన్వంతరీ ఆచార్య, వేదికపై రామబ్రహ్మం, బాలాజీ తదితరులు

తెలుగుభాషకు ప్రత్యేక స్థానం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాష, సాహిత్యం అజరామరమని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని భావతరంగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మహతి కళావేదికపై మంగళవారం తెలుగు సాహితీ వైభవం కార్యక్రమం నిర్వహించారు. రచయిత డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య మాట్లాడుతూ, మాతృభాషను, మాతృభూమిని మరువరాదన్నారు. సరస్వతి కళా సమితి అధ్యక్షుడు శేషాచార్యులు మాట్లాడుతూ, మాతృభాష కమ్మదనం అమోఘమన్నారు. ఘంటసాల సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు జి. రామబ్రహ్మం మాట్లాడుతూ, అమ్మభాష వస్తే అన్ని భాషలను అలవోకగా నేర్చుకోవచ్చన్నారు. సాహితీ కదంబం ఆకట్టుకుంది. భావతరంగిణి గౌరవాధ్యక్షుడు కృష్ణమోహనరావు, సంస్థ అధ్యక్షుడు భవిష్య, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, ప్రముఖ హరికథకుడు రాంబాబు, రాధికారాణి, మేరీ కృపాబాయి, పోతురాజు, జొన్నలగడ్డ ఝాన్సీ, మేడిశెట్టి యోగేశ్వరరావు, మాదిరాజు శివలక్ష్మి, మొదలి శ్రీవిద్య, జొన్నలగడ్డ కాంత్ పాల్గొన్నారు. నాటాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు శిష్య బృందం జానపద నృత్యం అలరించింది.



జలాధివాస పూజలు చేస్తున్న విద్యాసాగర్ గురూజీ, ట్రస్టీలు

వైభవంగా జలాధివాసం

చల్లపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పాగోలులోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలో కమలాత్మికా సహిత అచ లేశ్వర ప్రతిష్ఠామహోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం విశేషపూజలు జరిగాయి. ఉదయం మండప పూజలు, మూలమంత్ర జపా లు, అనుష్ఠానాలు, వేదపారాయణం, జలాధివాసం, ఊరేగింపు, శ్రీ చక్ర నవావరణార్చన, హోమం, పంచసూక్త హవనం, బలిహరణ, ఆజ్యపూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, కేదార శర్మ నిర్వహించారు. ఆలయ ట్రస్టీ మేకా బంగారుబాబు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్ ప్రతిష్ఠామహోత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

ఉపాధ్యాయుడికి టీడీపీ నేత పరామర్శ



సాల్మన్‌రాజును పరామర్శిస్తున్న పరుచూరి సుభాష్ చంద్రబోస్

ఘంటసాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో గృహాన్ని కోల్పోయిన ఉపాధ్యాయుడు కె.సాల్మన్‌రాజును మంగళవారం టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దుస్తులు, ఫర్నీచర్ ఇతర సామాగ్రి మొత్తం కాలిపోయినట్లు సాల్మన్‌రాజు వివరించారు. నాయకులు యార్లగడ్డ వీరభద్రరావు, ఆరవపల్లి బాపనయ్య పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి మైత్రి ఫౌండేషన్ సాయం



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఈడేపల్లికి చెందిన సయ్యద్ అఫ్రిన్ (4) గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. తండ్రి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం మైత్రి ఫౌండేషన్ రూ.35 వేల ఆర్థిక సాయాన్ని సభ్యులు పోలగాని అశోక్ చేతుల మీ దుగా అందజేసింది. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కె. వేణుకుమార్, కార్యదర్శి డి. రాధాకృష్ణ, కోశాధికారి కనకరాజు, సభ్యులు వక్కంటి రమాదేవి, అబ్దుల్ మొబిన్ తదితరులు పాల్గొన్నారు.

తోట సోమశేఖర్‌కు జనసేన నేతల పరామర్శ

కోడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పితృవియోగానికి గురైన జనసేన ఉపాధ్యక్షుడు తోట సోమశేఖర్‌రావును మండల జనసేన నాయకులు మంగళవారం పరామర్శించారు. విశ్వనాధపల్లి గ్రామంలో ఆయన స్వగృహం వద్ద ఆయన తండ్రి వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పించి సోమశేఖర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడు, యర్రంశెట్టి దామోదర్‌రావు, కోట సుబ్బారావు, బాదర్ల మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలిచ్చిన ఆక్సిజన్ సిలిండర్లు మాయం

అవనిగడ్డ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రోగుల సౌకర్యార్థం దాతలు సమకూర్చిన ఆక్సిజన్ సిలెండర్లు ఏమయ్యాయని కూటమి నేతలు మంగళవారం అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించారు. కరోనా సమయంలో పదుల సంఖ్యలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను, సిలెండర్లను విరాళంగా అందజేశారన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రభుత్వం పంపిన పరికరాలు తప్ప మిగిలినవి కనిపించటం లేదని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. డైరెక్టర్లు కృష్ణకుమారి, తుంగల వెంకటగిరి, బండే కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26వ తేదీన జరుగనున్న మహాశివరాత్రి మహోత్సవాలను సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి రోజున ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహాశివరాత్రి మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, ఫిషరీష్ సిబ్బందిపై గురుతర బాధ్యత ఉందని తెలిపారు. ఎంపీడీవో మరియకుమారి, పోలీసు, ఫిషరీష్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపు జనసేన పార్టీ బాధ్యత కావాలి : బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా నిలబడిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించటం జనసేన పార్టీలోని ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆరు మండలాల జనసేన పార్టీ నాయకులతో బుద్ధప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు బండి రామకృష్ణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, దేవనబోయిన వెం కటేశ్వరరావు, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, నెరుసు కృష్ణాంజనేయులు, రాయపూడి వేణుగోపాల్, గాజుల శంకర్‌రావు, ఉస్మాన్ షరీఫ్, బచ్చు వెంకట్‌నాథ్ ప్రసాద్, చెన్నగిరి సత్యనారాయణ, బాదర్ల లోలాక్షుడు, గుడివాక శివరావు, మర్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, చల్లపల్లి

ఆర్.ఓ.సి నెం.32/2024 ఎ1 **టెండరు ప్రకటన** తేది.18.02.2025

కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, చల్లపల్లి గ్రామపంచాయితీ నందు 2025-26 సంవత్సరమునకు అనగా ది.01-04-2025 నుండి 31-03-2026వ తేదీ వరకు ఈ దిగువ షెడ్యూల్‌లో చూపిన పనులను కాంట్రాక్టు లేబరు పద్ధతిపై పనిచేయుటకు ది.22-02-2025 ఉదయం 10-00 గం.ల నుండి 12-00 గం.ల వరకు గ్రామపంచాయతీ కార్యాలయము వద్ద పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 1.00 గంటకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరువబడును. టెండరులో పాల్గొనదలచినవారు నిర్ణయించిన ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చును. ప్రభుత్వంవారి షరతులకు లోబడి టెండర్లు దాఖలు చేయవలెను. మిగిలిన వివరములకు పంచాయతీ కార్యాలయము పనిచేయు వేళలందు అడిగి తెలుసుకొనవచ్చును. టెండరు షెడ్యూల్స్ ది.21.02.2025వ తేదీ ఉదయం 10.00. గంటల నుండి సాయంత్రం 5.00 గం.ల వరకు ఇవ్వబడును.

ఐటం నెం.	టెండరు షెడ్యూలు పనియొక్క వివరములు	చెల్లించవల్సిన టెండరు ధరావత్తు రూ.
1.	ప్రజారోగ్య పనుల నిర్వహణవద్దు క్రింద పన్నుల వసూళ్ళకు, ఆఫీసు పనులకు వినియోగించుకొనుటకు ప్రస్తుతము సదరు పనులు నిర్వహిస్తున్న వ్యక్తులకు ప్రభుత్వం వారి ఉత్తర్వులననుసరించి ప్రాధాన్యత ఇచ్చుపద్ధతిపై 3గురు వ్యక్తుల సేవలు ది. 01.04.2025 నుండి 31.03.2026 వరకు సప్లయిచేయుట.	5000/-
2.	చల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రజారోగ్య పారిశుధ్య పనుల నిర్వహణకు 18 మంది వ్యక్తుల సేవలను ది. 01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు సప్లయి చేయుట	15,000/-
3.	చల్లపల్లి గ్రామపంచాయతీ మెయిన్ బజారులలో ప్రజారోగ్య పారిశుధ్య పనుల నిర్వహణకు 13 మంది వ్యక్తుల సేవలు ది.01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు సప్లయి చేయుట.	15,000/-
4.	చల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో డ్రయిన్ పనుల నిర్వహణకు 8 గురు వ్యక్తుల సేవలు ది.01-04-2025 నుండి ది.31-03-2026 వరకు సప్లయి చేయుట.	5,000/-
5.	చల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పార్క్ వాచర్‌గా 1 వ్యక్తి సేవలను ది. 01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు సప్లయి చేయుట.	5000/-
6.	చల్లపల్లి గ్రామపంచాయతీ పి.డబ్ల్యు.యస్ స్కీం టర్న్ కాక్స్ 7గురు వ్యక్తుల సేవలను ది. 01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు సప్లయి చేయుట.	5000/-
7.	చల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వీధిదీపంల రిపేర్లకు ఎలక్ట్రీషియన్స్ 2 వ్యక్తుల సేవలను ది. 01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు సప్లయి చేయుట.	5000/-

కార్యదర్శివారి నోటు:- 1. పైన తెలిపిన పనులే కాకుండా పంచాయతీకి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను. 2. రు గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంటు ఇవ్వబడును. ఆలస్యంనకు వడ్డీ ఇవ్వబడదు. 3. గతంలో ఈ పంచాయతీలో పనిచేసిన వారికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వబడును. 4. టెండర్లు స్వీకరించుటకు లేదా రద్దు చేయుటకు పంచాయతీవారికి పూర్తి అధికారము కలదు. 5. సంబంధిత అధికారుల నుండి అనుమతి పొందిన తదుపరి పేమెంటు చేయబడును. 6. ఐటం నెం.2 నుండి 7 వరకు సింగిల్ టెండర్లు ఆమోదించబడవు. 7. బడ్జెట్‌కు లోబడి వ్యక్తులకు రేటు నిర్ణయించబడును.

సం/- పి.వి.మాధవేంద్రరావు, పంచాయతీ సెక్రటరీ, చల్లపల్లి గ్రామ పంచాయతీ, కృష్ణాజిల్లా